శనివారం
26-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 66
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆఫ్రికా అభివృద్ధికి సహకారం: జిన్‌పింగ్

ఆఫ్రికా తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడంలో, పారిశ్రామికీకరణ, ఆర్థిక వైవిధ్యతను సాధించడంలో చైనా తన పూర్తి సహకారాన్ని, మద్దతు ఇస్తుందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటించారు.

2లో

బోగస్ ఓట్లపై నువ్వా...నేనా

- దిల్లీకి చేరనున్న వివాదం
- టీడీపీ, వైసీపీ పోటాపోటీ ఫిర్యాదులకు సన్నద్ధం
- 28న సీఈసీతో తొలుత చంద్రబాబు భేటీ
- వెంటనే వైసీపీ ఎంపీలకు అపాయింట్‌మెంట్ ఖరారు

విశాలాంధ్ర బ్యూరో‌- అమరావతి:
రాష్ట్రంలో పెద్దఎత్తున రికార్డుల్లోకి బోగస్ ఓట్ల చేరిక, మరోవైపు ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారి ఓట్ల తొలగింపు వివాదం దిల్లీకి చేరనుంది. దీనిపై ఈనెల 28వ తేదీ దిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషనర్‌తో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు భేటీ కానుండగా, దీనికి పోటీగా అధికార వైసీపీ ఎంపీలు కూడా అదే రోజు ఎన్నికల సంఘానికి టీడీపీపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. 28న మధ్యాహ్నం 3.30 గంటలకు చంద్రబాబుకు కేంద్ర ఎన్నికల కమిషన్ అపాయింట్‌మెంట్ ఇచ్చింది. దీంతో 27న సాయంత్రమే ఆయన దిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా చంద్రబాబు ఫిర్యాదు చేయనున్నారు. అధికారపార్టీకి చెందినవారు బల్క్‌గా ఫారం-7లు ఇవ్వడం పై సాక్ష్యాలతో సహా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. దొంగ ఓట్ల చేర్పింపు, టీడీపీకి చెందిన వారి ఓట్లను తొలగించడం, ఒకే ఇంటి నంబరుపై వందల సంఖ్యలో ఓట్లను చేర్చడం వంటి అక్రమాలపై బీఎల్‌ఓలకు ఫిర్యాదు చేసినా వాటిని తొలగించడం లేదని టీడీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. బీఎల్‌ఓలు, మండల అధికారులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారని తెలుగుదేశం చెబుతోంది. ఈ క్రమంలో వీటన్నింటిపైనా సాక్ష్యాధారాలతో సహా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేయనున్నారు. అలాగే గత నాలుగు సంవత్సరాలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపు, నకిలీ ఓట్లు చేర్పు పెద్దఎత్తున కొనసాగిస్తుండగా, ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కేవలం 2022 జనవరి 6 తర్వాత తొలగించిన ఓట్ల పరిశీలనకే పరిమితం అవడంపై కూడా చంద్రబాబు సీఈసీకి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. 2020-21 సంవత్సరాల్లో అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో టీడీపీ సానుభూతిపరుల ఓట్లను నిబంధనలకు విరుద్ధంగా అనేక గ్రామాల్లో పెద్దఎత్తున తొలగించిన తీరు ఆధారాలతో సహా ఇప్పటికే రుజువైంది. దానిపై కొందరు అధికారులపై కూడా చర్యలు తీసు కున్నారు. ఇటువంటి ఘటనలు ఇతర నియోజకవర్గాల్లోనూ బయల్పడుతున్నాయి. అయినప్పటికీ ఎన్నికల సంఘం కటాఫ్ తేదీ నిర్ణయించి, జనవరి 2022 తర్వాత తొలగించిన ఓట్ల పునఃపరిశీలనకే పరిమితం కావడం ఏమిటి ?

- మిగతా 2 లో

రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తా

- క్రిమినల్ చర్యలు ఎదుర్కొంటావ్
- పంజాబ్ సీఎం మాన్‌కు గవర్నరు బెదిరింపు

చండీగఢ్:
దేశంలో రాజ్‌భవన్‌ల కార్యకలాపాలు, పనితీరుపై తీవ్ర దుమారం చెలరేగుతున్నప్పటికీ గవర్నర్ల వ్యవహార శైలిలో మార్పు కనిపించడం లేదు. రాష్ట్రాల్లో ప్రజాప్రభుత్వాలు ఉన్నప్పటికీ మోదీ సర్కారు అండతో గవర్నర్లు సమాంతర పాలన సాగిస్తున్నారు. ప్రజాప్రభుత్వాలకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై సంతకాలు సైతం చేయకుండా కాలయాపన చేయడం, ఇబ్బందులు సృష్టించడం వంటి నియంతృత్వ ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఇందుకు తెలంగాణ, తమిళనాడు, దిల్లీ వంటి రాష్ట్రాలు ఉదాహరణలు. తాజాగా పంజాబ్ గవర్నరు బన్వరిలాల్ పురోహిత్ అధికార జులుం ప్రదర్శించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై బెదిరింపులకు దిగారు. ఏకంగా రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తానని బెదిరించారు. అంతేకాకుండా క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.
పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, గవర్నరు భన్వరిలాల్ పురోహిత్ మధ్య చిచ్చురేగింది. తన లేఖలకు సమాధానం ఇవ్వకపోతే రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తానని, క్రిమినల్ చర్యలు ఎదుర్కొంటారని శుక్రవారం ముఖ్యమంత్రిని బెదిరించారు. గతంలో రాసిన లేఖలకు సమాధానం ఇవ్వకపోవడంతో తాను తీవ్ర అసంతృప్తికి గురయ్యానని, రాజ్యాంగ యంత్రాంగం వైఫల్యాలపై తాను రాష్ట్రపతికి నివేదిక పంపాల్సి ఉంటుందని తాజాగా సీఎం మాన్‌కు గవర్నరు లేఖ రాశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, భారత శిక్షాస్మృతిలోని 124 సెక్షన్ కింద తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు

- మిగతా 2 లో

వాన్‌పిక్ కేసులో
సుప్రీం స్టేటస్ కో

ఓబులాపురం మైనింగ్ కేసులో శ్రీలక్ష్మికి నోటీసు

విశాలాంధ్ర బ్యూరో‌- అమరావతి:
వాన్‌పిక్ కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. వాన్‌పిక్ భూములకు సంబంధించి సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. వాన్‌పిక్ ప్రాజెక్టుకు అనుకూలంగా ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఈడీ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, పంకజ్ మిట్టల్‌తో కూడిన ధర్మాసనం ముందుకు ఈ కేసు విచారణ జరిగింది. వాదనలు విన్న ఉన్నతన్యాయస్థానం ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ, ఉత్తర్వులు ఇచ్చే వరకు 'స్టేటస్ కో' అమలు చేయాలని సుప్రీం ఆదేశించింది. వాన్‌పిక్ ఆస్తుల అటాచ్ చెల్లదంటూ ఏపీ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తక్షణమే ఈడీ అటాచ్ చేసిన 11,804.78 ఎకరాలను విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గతేడాది సెప్టెంబర్‌లో 1,416 ఎకరాల విడుదలకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే 2014, 2017లో వాన్‌పిక్‌కు చెందిన 13,221 ఎకరాలను ఈడీ అటాచ్ చేసింది. ఈడీ చర్యను పీఎంఎల్ఏ అప్పీలేట్ ట్రిబ్యునల్

- మిగతా 2 లో

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
తిప్పికొడదాం

- మోదీ, జగన్ ప్రభుత్వాలను ఓడిద్దాం
- అంబేద్కర్ రాజ్యాంగమే దేశానికి రక్ష
- మచిలీపట్నం రౌండ్‌టేబుల్ సమావేశంలో రామకృష్ణ

8లో

మోదీ, జగన్ సర్కార్లు బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఎన్ఐఏ, సీబీఐ, ఈడీ వంటి సంస్థల ద్వారా ప్రత్యర్థులు, విపక్షాల నాయకులపై అక్రమ కేసులు బనాయించి మోదీ ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ చేస్తుండగా...రాష్ట్రంలో సీఐడీ, పోలీసులతో భావప్రకటనా స్వేచ్ఛ లేకుండా జగన్ ప్రభుత్వం భయబ్రాంతులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వడంలో
జాప్యమెందుకు?

నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు: జగదీశ్

2లో

హోంగార్డులపై
నిర్లక్ష్యం

- అమలుకు నోచుకోని రోజువారీ వేతనం
- ఉద్యోగ భద్రత కరువు
- ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి

విశాలాంధ్ర బ్యూరో‌-అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌లో హోంగార్డుల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. హోంగార్డులు నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారు. వేతనాల పెంపు లేక... పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా హోంగార్డుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ వారి స్థితిగతుల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఎన్నికల వేళ మాత్రమే అధికార, ప్రతిపక్ష నేతలు హోంగార్డుల సమస్యలపై స్పందిస్తుంటారు. ఆ తర్వాత ఎవరూ వారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. హోంగార్డులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న పెద్దలు...వారి సమస్యల పట్ల మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు. పోలీసుశాఖ ప్రతిష్ఠ పెంచేలా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనాల పెంపు ఊసే కనిపించడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో హోంగార్డుల రోజు వారీ వేతనం రూ.400 నుంచి రూ.600కు పెరిగింది. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం మరో రూ.110 పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. కానీ అమలు చేయలేదు. దీనిపై సీఎం జగన్‌కు ఇటీవల టీడీపీ నాయకుడు నారా లోకేశ్ లేఖ రాశారు. పెంచిన రూ.110 కూడా ఇవ్వకపోవడంతో జగన్ ప్రభుత్వంపై హోంగార్డులు ఆగ్రహంతో ఉన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, పిల్లల చదువులు, ఇంటి అద్దెల భారం హోంగార్డుల జీవితాలను ఛిద్రం చేస్తోంది. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. హోంగార్డుల వేతనాల పెంపుపై సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి.

జగన్ పాదయాత్ర హామీ అమలేది?
ఎన్నికల మేనిఫెస్టోను 95 నుంచి 98 శాతం అమలు చేశామని ఆర్భాటంగా చెప్పుకుంటున్న జగన్ సర్కార్‌కు హోంగార్డులకు ఇచ్చిన హామీ మాత్రం గుర్తుకు రావడం లేదు. పాదయాత్రలో సైతం హోంగార్డులను ఆదుకుంటానని జగన్ హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా హోంగార్డుల సమస్యలపైనా, వారికిచ్చిన హామీలపైనా దృష్టి లేదు. క్యాజువల్ సెలవులు లేవు. తెలంగాణ ప్రభుత్వం కంటే అధికంగా క్యాజువల్ సెలవులు ఇస్తామని చెప్పిన జగన్...పూర్తిగా తమను మోసం చేశారని హోంగార్డులు వాపోతున్నారు. మరోవైపు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డులకు జీవిత బీమాను రూ.30 లక్షలకు పెంచాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై హోంగార్డుల సంఘం అనేకసార్లు రాష్ట్ర పోలీసు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



జగన్...ఇసుకాసురుడు

- నాలుగేళ్లలో రూ.40 వేల కోట్ల దోపిడీ
- ఎన్జీటీ, సుప్రీంకోర్టు తీర్పులనూ ఉల్లంఘించారు
- పక్కా ఆధారాలతో ప్రశ్నిస్తున్నాం
- 48 గంటల్లో సమాధానం చెప్పాలి
- టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్



విశాలాంధ్ర బ్యూరో‌-అమరావతి:
జగన్ ఇసుకాసురుడుగా మారి నాలుగేళ్లలో రూ.40 వేల కోట్ల ఇసుక దోపిడీకి పాల్పడ్డారని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక దోపిడీని వివరించారు. ఎన్జీటీ, సుప్రీం కోర్టు తీర్పులను సైతం ఉల్లంఘించారని, జగన్‌కు ఇసుకే ఆహారం...భూములు పలహారం...మద్యమే మంచినీరు...విధ్వంసమే ఆశయం...హింసించడమే ఆనందం...లక్షల కోట్ల దోపిడీనే లక్ష్యం చేసుకున్నారని ఆయన మండి పడ్డారు. ఇసుక దోపిడీపై తమ వద్ద పక్కా ఆధారాలతో ప్రశ్నిస్తున్నామని, జగన్ 48 గంటల్లో సమాధానం చెప్పాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రభుత్వ ఇసుక దోపిడీపై పూర్తిగా విచారణ చేయిస్తామని, తప్పు చేసిన అధికారులను శిక్షిస్తామని హెచ్చరించారు. ఒక మనిషి సహజ వనరుల్ని ఎలా మింగేస్తున్నాడో, తన దోపిడీకోసం ప్రజాస్వామ్యంలో ఎన్ని అక్రమాలకు పాల్పడుతున్నాడో చెప్పేందుకు ఇసుక అక్రమాలు ఒక ఉదాహరణగా

- మిగతా 2 లో

ఆఫ్రికా అభివృద్ధికి సహకారం: జిన్‌పింగ్

జోహాన్స్‌బర్గ్ : ఆఫ్రికా తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడంలో, పారిశ్రామికీకరణ, ఆర్థిక వైవిధ్యతను సాధించడంలో చైనా తన పూర్తి సహకారాన్ని, మద్దతు ఇస్తుందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటించారు. ఆఫ్రికా పారిశ్రామికీకరణకు చైనా మద్దతు ఇవ్వడంపై చైనా సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయంపై పెట్టుబడులను పెంచేందుకు చైనా కంపెనీలను ప్రోత్సహిస్తుందని చెప్పారు. తాజాగా చైనా-ఆఫ్రికా దేశాల నాయకులు జోహాన్స్‌బర్గ్‌లో జరిగిన చర్చల్లో జిన్‌పింగ్ కీలక ప్రసంగం చేశారు. ఆఫ్రికా ఆహార స్వయంసమృద్ధి, స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో సహాయం చేయడంపై చైనా తన పూర్తి సహకరాన్ని అందిస్తుందన్నారు. ఆఫ్రికాలో ఆహార ఉత్పత్తిని ప్రోత్సహించడం, దాని ఆహార భద్రతను కాపాడే సామర్థ్యాన్ని సమర్థవంతంగా పెంచడంతోపాటు వ్యవసాయ ఆధునీకరణలో సంబంధిత లక్ష్యాలను చేరుకోవడంలో సహాయం చేయడం తమ లక్ష్యంగా జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఈ నవంబర్‌లో హైనాన్‌లో వ్యవసాయంలో చైనా-ఆఫ్రికా సహకారంపై చైనా రెండవ ఫోరమ్‌కు ఆతిథ్యం ఇవ్వనుందని జిన్‌పింగ్ తెలిపారు. ప్రస్తుత ఆహార సంక్షోభాన్ని పరిష్కరించడంలో ఆఫ్రికాకు సహాయం చేయడానికి అవసరమైన కొన్ని ఆఫ్రికన్ దేశాలకు చైనా అదనపు అత్యవసర ఆహార సహాయాన్ని అందజేస్తుందన్నారు. చైనా-ఆఫ్రికా సహకారం కోసం ప్రతి సంవత్సరం 500 మంది ప్రిన్సిపాల్స్, వృత్తి విద్యా కళాశాలల ఉన్నత స్థాయి ఆఫ్రికా ఉపాధ్యాయులుకు చైనీస్ భాష, వృత్తి నైపుణ్యాలు రెండింటినీ కలిగిన 10,000 మంది సాంకేతిక సిబ్బందికి శిక్షణ ఇస్తుందన్నారు. ఆఫ్రికా శాంతి, ఐక్యత, శ్రేయస్సు లక్ష్యంగా కొత్త ఆఫ్రికాను నిర్మించడానికి చైనా అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. వలసవాదం, ఆధిపత్య వాదాన్ని నిస్సందేహంగా వ్యతిరేకించడం ద్వారా తమ అభివృద్ధిని సాకారం చేసుకోవడానికి ఒక మంచి వాతావరణాన్ని సృష్టించేందుకు చైనా, ఆఫ్రికాలు కలిసి పనిచేయాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ఉమ్మడి, సమగ్రమైన, సహకార, స్థిరమైన భద్రత అనే కొత్త దృక్పథాన్ని అమలు చేయడానికి, చర్చలు, సహకారం ద్వారా విభేదాలు, వివాదాల పరిష్కారాన్ని సమర్థించడం, అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యల రాజకీయ పరిష్కారాన్ని సులభతరం చేయడం, ప్రపంచశాంతిని కాపాడడం కోసం ఆఫ్రికాతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని జిన్‌పింగ్ తెలిపారు. మార్పిడి ద్వారా నాగరికతల మధ్య దూరాన్ని అధిగమించాలని, నాగరికతల మధ్య సమగ్రతను, పరస్పర అభ్యాసాన్ని ప్రోత్సహించాలని అన్నారు. ఆఫ్రికన్ యూనియన్ పూర్తి సభ్యత్వానికి మద్దతు ఇవ్వడానికి వచ్చే నెలలో జరిగే జి20 శిఖరాగ్ర సమావేశంలో చైనా కూడా చురుకుగా పని చేస్తుంద నతీఆఫ్రికా యొక్క ఆకాంక్షను నెరవేర్చడానికి భద్రతా మండలి సంస్కరణపై ప్రత్యేక ఏర్పాట్లు చేయడానికి చైనా మద్దతు ఇస్తుందని అన్నారు.

చంద్రయాన్ విజయం యావత్ మానవాళిది: మోదీ

గ్రీస్‌లో ప్రధానికి ఘన స్వాగతం

ఏథెన్స్: చంద్రయాన్-3 విజయం భారతదేశ విజయం మాత్రమే కాదు... ఇది మానవాళి మొత్తం సాధించిన విజయం అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ దక్షిణాఫ్రికాలో బ్రిక్స్ సమావేశాలు ముగిసిన అనంతరం శుక్రవారం గ్రీస్ తరలి వెళ్లారు. గ్రీస్ రాజధాని ఏథెన్స్ లో ఆయనకు ఘనస్వాగతం లభించింది. విమానాశ్రయంలో గ్రీస్ విదేశాంగ మంత్రి జార్జ్ గెరాపెట్రిటిస్ ఆయనకు స్వాగతం పలికారు. ప్లకార్డులు చేతపట్టుకుని ప్రవాస భారతీయులు విమానాశ్రయం వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకుని వందేమాతరం అంటూ నినదించారు. కొంతమంది సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లు తీసుకుని ప్రధానితో కరచాలనం చేశారు. గ్రీస్ ప్రధాని కిరియకోస్ మిట్సోటాకిస్ ఆహ్వానంపై మోదీ గ్రీస్ పర్యటనకు వెళ్లారు. 40 ఏళ్ల తర్వాత ఓ భారత ప్రధాని గ్రీస్ లో అడుగుపెట్టడం ఇదే ప్రథమం. కాగా, తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ గ్రీస్ దేశాధ్యక్షురాలు కేథరినా సకెల్లారోపౌలోవ్ తో సమావేశమయ్యారు. భారత్-గ్రీస్ స్నేహ సంబంధాలు మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. సుస్థిర అభివృద్ధిపై ఆలోచనలను పంచుకున్నారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3 విజయవంతం కావడం పై గ్రీస్ దేశాధ్యక్షురాలు ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. అయితే ఇది కేవలం భారత్ విజయం మాత్రమే కాదని, ఇది యావత్ మానవాళి సాధించిన విజయంగా తాము భావిస్తున్నామని మోదీ ఆమెతో చెప్పారు. చంద్రయాన్-3 ద్వారా సేకరించే డేటా శాస్త్రవేత్తలందరికీ, మానవాళి మొత్తానికి ఉపయోగపడనుందని తెలిపారు. ఇక, గ్రీస్ ప్రధాని కిరియకోస్ మిట్సోటాకిస్ తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత దృఢతరం చేసే దిశగా వీరి మధ్య చర్చలు సాగాయి. తొలుత మోదీ దక్షిణాఫ్రికా నుంచి గ్రీస్ రాజధానికి చేరుకున్నారు. అక్కడ 15వ బ్రిక్స్ సదస్సులో పాల్గొని, సభ్య దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రపంచ నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. మోదీ ఏథెన్స్‌లోని 'తెలియని సైనికుడి సమాధి' వద్ద పుష్పగుచ్ఛం ఉంచారు.

ది టోంబ్ ఆఫ్ ది అన్నోన్ సోల్జర్ అనేది ఓల్డ్ రాయల్ ప్యాలెస్ ముందు ఏథెన్స్‌లోని సింటాగ్మా స్క్వేర్‌లో ఉన్న ఒక యుద్ధ స్మారక చిహ్నం. ఇది వివిధ యుద్ధాలలో మరణించిన గ్రీకు సైనికులకు అంకితం చేయబడిన సమాధి. అనంతరం గ్రీస్ రక్షక దళాలనుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఇంతకుముందు 1983 సెప్టెంబరులో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ గ్రీస్‌లో పర్యటించారు. ఇటీవల కాలంలో సముద్ర రవాణా, రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులు వంటి రంగాలలో సహకారం ద్వారా భారత్-గ్రీస్ మధ్య సంబంధాలు బలోపేతం అయ్యాయి.

కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

పెషావర్: ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులోని వాయువ్య పాకిస్థాన్‌లో గిరిజన జిల్లాలో శుక్రవారం భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో చట్టవిరుద్ధమైన తెహ్రీక్-ఏ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ)కి చెందిన ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. అందిన సమాచారం ప్రకారం దక్షిణ వజీరిస్థాన్ గిరిజన జిల్లాలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో భద్రతా దళాలు వారితో ఎదురు కాల్పులు జరిపాయి. ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమవ్వగా, మిగిలిన వారు పారిపోయారు. పారిపోయిన నిందితులను పట్టుకునేందుకు బలగాలు భారీ కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ వారం ప్రారంభంలో ఖైబర్ ఫఖ్తుంక్వా ప్రావిన్స్‌లో భద్రతా దళాల కాన్వాయ్‌పై టీటీపీ ఉగ్రవాదులు దాడి చేయడంతో ఆరుగురు పాకిస్థాన్ సైనికులు, నలుగురు ఉగ్రవాదులు మరణించారు. 2009లో ఆర్మీ హెడ్‌క్వార్టర్‌పై దాడి, సైనిక స్థావరాలపై దాడులు, 2008లో ఇస్లామాబాద్‌లోని మారియట్ హోటల్‌పై బాంబు దాడితో సహా పాకిస్థాన్ అంతటా అనేక ఘోరమైన దాడులకు అల్ ఖైదాకు సన్నిహితంగా భావిస్తున్న తెహ్రీక్ ఏ తాలిబాన్ (టీటీపీ) కారణమైంది.

సుప్రీం స్టేటస్ కో

(మొదటిపేజీ తరువాయి)

సమర్థించింది. వాడరేవు - నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్ పేరుతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల్లో ఒకటైన రస్ అల్ ఖైమాతో ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలనుకున్న ప్రాజెక్టు ఇది. దీనిపై సుప్రీంలో రెండుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. ఇప్పటికే 15 ఏళ్లు వృథాగా గడచిపోయాయని, ఇందులో దేశాల మధ్య బంధానికి సంబంధించిన అంశం ముడిపడి ఉందని వాన్‌పిక్ ప్రాజెక్ట్ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాన్‌పిక్ అనేది రాష్ట్ర ప్రభుత్వం- రస్ అల్ ఖైమాతో సంయుక్తంగా ఏర్పాటు చేసిన స్పెషల్ పర్పస్ వెహికిల్ అని తెలిపారు. విచారణలో జాప్యం కారణంగా ప్రాజెక్టు ముందుకు కదలడం లేదని వాదించారు. ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్ ఉంటే దానిపై విచారణ జరపవచ్చని, కానీ మొత్తం ప్రాజెక్టు భూములను ఈడీ అటాచ్ చేయడం తగదంటూ ప్రాజెక్ట్ తరపు న్యాయవాదులు విన్నవించారు.

శ్రీలక్ష్మికి సుప్రీం నోటీసులు

ఓబులాపురం మైనింగ్ కేసులో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వై.శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఆమెపై ఉన్న అభియోగాలను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పరిశ్రమల శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగానికి పాల్పడి అనంతపురం జిల్లాలో ఓబులాపురం మైనింగ్ కంపెనీకి 2007లో అక్రమంగా గనులు కేటాయించారంటూ సీబీఐ కేసులు నమోదు చేసింది. సీబీఐ కోర్టులో ఆమెకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పును శ్రీలక్ష్మి సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మిపై అభియోగాలను కొట్టివేస్తూ గతేడాది నవంబరు 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనిపై శుక్రవారం జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ ఎం.సుందరేశ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి శ్రీలక్ష్మికి నోటీసులు జారీ చేసింది.

రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

తనతో మాట్లాడాలని మాన్‌కు సలహా ఇచ్చారు. రాజ్యాంగంలోని 356 అధికరణ కింద నిర్ణయం తీసుకొని రాష్ట్రపతికి లేఖ రాస్తే పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలని గవర్నరు హెచ్చరించారు. తాను రాసిన లేఖలకు సమాధానం ఇవ్వాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల సమస్యపై ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పకపోతే చట్టం, రాజ్యాంగం ప్రకారం చర్యలు తీసుకోవడం మినహా తనకు మరో మార్గం లేదని స్పష్టంచేశారు. భగవంత్ మాన్‌కు రాసిన లేఖను గవర్నరు శుక్రవారం మీడియాకు విడుదల చేశారు.

ఆగస్టు 1వ తేదీన తాను రాసిన లేఖకు ఇప్పటి వరకు ఎందుకు సమాధానం పంపలేదని సీఎం మాన్‌ను ప్రశ్నించారు. తాను అడిగిన సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగానే ఇవ్వడం లేదని తనకు స్పష్టమవుతోందని ఆగ్రహం వెలిబుచ్చారు. 36 స్కూల్ ప్రిన్సిపాల్స్‌కు విదేశీ శిక్షణతో పాటు అనేక అంశాలపై సీఎం మాన్‌కు గవర్నరు చాలా ఉత్తరాలు రాశారు. ఆ ఉత్తరాలకు కనీసం సమాధానం లేదని గవర్నరు విమర్శించారు. పంజాబ్‌లో విచ్చలవిడిగా మాదక ద్రవ్యాల వ్యాపారం జరుగుతుందని, ఎక్కడబడితే అక్కడ డ్రగ్స్ లభిస్తున్నట్లు అనేక సంస్థల ద్వారా తనకు సమాచారం వస్తున్నదని తాజా లేఖలో గవర్నరు పేర్కొన్నారు. మందుల షాపుల్లోనూ, ప్రభుత్వ నియంత్రణలో గల లిక్కర్ దుకాణాల్లోనూ డ్రగ్స్ లభిస్తున్నాయని ఆరోపించారు. 'మీ ప్రవర్తన భారత రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా పనిచేసేలా కనిపించడం లేదు. ఇది గౌరవ సుప్రీంకోర్టు తీర్పులను సైతం ధిక్కరించినట్లే అవుతుంది' అని గవర్నరు బెదిరించారు.

బిల్ గేట్స్ విండోస్‌కు 28 ఏళ్లు...

కాలిఫోర్నియా: కంప్యూటర్ ఓఎస్ అనగానే మనకు విండోస్ పేరు గుర్తుకు వస్తుంది. మార్కెట్లో ఎన్ని కొత్త ఓఎస్‌లు వచ్చినా విండోస్ యూజర్ ఇంటర్‌ఫేస్ ప్రత్యేకం. అందుకే మైక్రోసాఫ్ట్ సంస్థ అభివృద్ధి చేసిన విండోస్ ఓఎస్‌నే ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది ఉపయోగిస్తున్నారు. ఈ ఓఎస్ విడుదలై 28 ఏళ్లు పూర్తయ్యాయి.

ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ విండోస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యేక గిఫ్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కొన్ని జ్ఞాపకాలు ఎప్పటికీ మీతో ఉండిపోతాయి...28 ఏళ్లుగా మిమ్మల్ని ఎంతో మంది అనుసరిస్తున్నారు. హ్యాపీ బర్త్‌డే విండోస్ అని బిల్ గేట్స్ ట్వీట్ చేశారు.

జగన్...ఇసుకాసురుడు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఇసుక ద్వారా అనేక రంగాలు లబ్ధి పొందుతాయి. ఇసుక అనేది సహజ సంపద. సహజ సంపద ప్రజలకు చెందాలిగానీ, ఇతరులకు దోపిడీ వనరుగా మారడానికి వీల్లేదు. ఇసుక నిర్మాణ రంగానికి చాలా కీలకం, 40లక్షల మంది నిర్మాణ రంగ కార్మికులకు జీవనోపాధి కల్పిస్తుంది. అలానే 125 ఇతర వృత్తుల జీవనోపాధికి కూడా ఇసుక చాలా కీలకం. భూగర్భజలాల వృద్ధి, పర్యావరణ సమతుల్యత, నదీజలాల పరిరక్షణ, మంచినీటి వనరుల సంరక్షణకు ఇసుక అవసరం అని చంద్రబాబు వివరించారు. టీడీపీ హయాంలో ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చామని, నిర్మాణ రంగం ఊపందుకోవాలన్న ఉద్దేశంతోనే ఉచిత ఇసుక పాలసీ అమలుచేశామని చెప్పారు. దానివల్ల లక్షలాది మందికి ఉపాధి కలిగిందన్నారు. ఇసుక రీచ్ ల నిర్వహణను డ్వాక్రాసంఘాలకు అప్పగించి... సాధారణప్రజలకు కూడా ఇసుక అందుబాటు లో ఉండేలా చేశామని తెలిపారు. అయితే అంతచేసినా ఇసుక దోపిడీ జరుగుతోందని అప్పుడు దుష్ప్రచారం చేశారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా... తానే ఇసుకను నేరుగా డోర్ డెలివరీ చేస్తానని హామీ ఇచ్చిన పెద్దమనిషి, విజయవంతంగా ఈ నాలుగేళ్లలో ఎక్కడా, ఎవరికీ దొరక్కుండా భారీ దోపిడీకి తెరతీశారన్నారు. టీడీపీ అమలుచేసిన ఉచిత ఇసుక విధానాన్ని రద్దుచేయడం వల్ల దాదాపు 40 లక్షల కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, పనిలేక కుటుంబపోషణ భారమై సుమారు 130 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక మాఫియా నిర్వాకంతో అన్నమయ్య డ్యామ్ కొట్టుకు పోగా 48 మంది చనిపోయారని తెలిపారు. గుండ్లకమ్మ గేట్ కొట్టుకుపోయింది. చివరకు ఇసుక మాఫియాపై ప్రేమతో ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్ని కూడా విధ్వంసం చేశారన్నారు. ఇసుక రీచ్ లను జేపీ పవర్ వెంచర్స్ కు అప్పగిస్తే, ఆ సంస్థ ఇసుక తవ్వకం.. అమ్మకం.. రవాణా వ్యవహారాలను టర్న్ కీ అనే మరోసంస్థకు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చింది. రెండు సంస్థలకు మధ్య వాటాల్లో తేడాలు రావడం తో జులై 2022 నుంచి టర్న్‌కీ సంస్థ పక్కకు తప్పుకుంది. 2022 ఆగస్టు నుంచి ఎక్కడికక్కడే వైసీపీనేతలే నిబంధనలు గాలికి వదిలేసి, పర్యావరణానికి తూట్లుపొడిచేలా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఇసుక తవ్వకాల్లో జగన్ రెడ్డి విధానం ఇష్టమొచ్చినట్టు తవ్వుకో... దొరికిందంతా దోచుకో.... లక్షలకోట్లు దాచుకో అన్న విధంగా ఉందని చంద్రబాబు అన్నారు. సీఎం ఇంటికి కూతవేటు దూరంలో, రాజధాని ప్రాంతంలో చుట్టూ జనావాసాల మధ్యలో గుండిమెడలో 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఈసీ లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. రాష్ట్రంలో కొన్ని వందల డంప్ లలో లక్షలాది టన్ను లు ఇసుకను అక్రమంగా నిల్వచేశారు. ఏ నదిలో చూసినా వందలాది వాహనాలు... రీచ్‌ల పక్కన, సమీపప్రాంతాల్లో అనకొండలను తలపించేలా జగన్ రెడ్డి సృష్టించిన ఇసుక కొండలు దర్శనమిస్తున్నాయని, ఎక్కడెక్కడ నిల్వలు చేశారో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చంద్రబాబు చూపించారు. నాలుగున్నరేళ్లలో ఎంత ఇసుక తవ్వారు... ఎంత అమ్మారు... ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చింది? ఏ రోజు ఏ రీచ్ నుంచి ఎంత ఇసుక ఎవరెవరు కొన్నారు? దీనిపై ఎంత జీఎస్టీ కట్టారు, ఏ సంస్థ పేరుతో కట్టారో వివరాలు బయటపెట్టాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. మైనింగ్, పోలీస్, విజిలెన్స్, ఏసీబీ విభాగాలు ఫెయిల్ అయినందునే ఎన్జీటీ స్పందించిందని, సిగ్గులేకుండా ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ ఎన్జీటీ తీర్పుపై సుప్రీంకోర్టుకి వెళ్లారని చంద్రబాబు విమర్శించారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వడంలో జాప్యమెందుకు?



విశాలాంధ్ర-గుంతకల్లు: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఐ అధ్వర్యంలో చేపట్టిన భూ ఆక్రమణ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలు పరిష్కరించడం చేతగాక గుంతకల్లులో రాత్రికి రాత్రి 144 సెక్షన్ విధించారని ఆరోపించారు. సీపీఐ నాయకులను అక్రమంగా నిర్బంధించడం, అరెస్టు చేయడం ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనమని మండిపడ్డారు. గుంతకల్లు రైల్వే గ్రౌండ్ ఆవరణలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులందరితో సభ జరిగింది. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ అధ్యక్షత వహించారు. జగదీశ్ మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణాల కోసం రూ.5 లక్షల వంతున ఆర్థిక సాయం చేయాలని, టిడ్కో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం మున్సిపల్ కమిషనర్‌కు, మున్సిపల్ చైర్‌పర్సన్‌కు, తహసీల్దార్‌కు అనేకమార్లు అర్జీలు ఇచ్చినా పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. అర్హులకు 90 రోజుల్లో ఇంటి స్థలం ఇస్తామన్న సీఎం జగన్ హామీ బూటకమని వ్యాఖ్యానించారు. 47 గజాల స్థలంలో నిర్మించే ఇంటిలో కాపురం ఎంత కష్టమో ఆలోచించాలని హితవు పలికారు. పేదలకు ఇంటి స్థలాల కోసం పోరాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేశ్, మండల కార్యదర్శి రాము రాయల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్ర, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి వెంకటనాయక్, నాయకులు ఉమర్ బాషా, గద్దం వెంకటేశ్‌ని అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రభుత్వానికి గుంతకల్లులో అర్హులైన పేదలకు,ఇళ్ల స్థలాలు కేటాయించాలని.

గుంతకల్లులో పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఐ సుదీర్ఘకాలంగా పోరాడుతోందని, కసాపురం రోడ్డులోని సర్వే నంబర్ 315, 318లో గల 10 ఎకరాలను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. గుంతకల్లు పట్టణంలో సుమారు 20 వేల మంది పేదలు నివేశన స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇళ్లు నిర్మించుకోలేదన్న సాకుతో గత ప్రభుత్వాలు ఇచ్చిన పట్టాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. గుంతకల్లు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ రాము హామీ ఇచ్చారని, అప్పటి దాకా వేచిచూసి...భూ ఆక్రమణకు దిగుతామని జగదీశ్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు మురళీకృష్ణ, మల్లయ్య, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి కుల్లాయప్ప, పట్టణ కార్యదర్శి పుల్లయ్య, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు వినోద్, నాయకులు అఖిల్, వంశీ, నందు, శివ, రమేశ్, నూర్ మొహమ్మద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులపై నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి వినతులు అందజేసినా స్పందన కనిపించలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హోంగార్డుల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాల్సి ఉంది. 11వ వేతన సవరణ సంఘం సూచనల మేరకు హోంగార్డుల వేతనం, ఇతర అలవెన్సుల పెంపుపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలి. పదవీ విరమణ తర్వాత రూ.10 లక్షల గ్రాట్యుటీ చెల్లింపు అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాల్సిన అవసరముంది. నిత్యం క్రమశిక్షణ, సేవా స్ఫూర్తితో పనిచేస్తున్న హోంగార్డుల వేతనం, ఇతర అలవెన్సులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఉద్యోగ సంఘాలు హోంగార్డుల సమస్యలపై మౌనం దాల్చడం తగదు.

జగన్ సర్కార్ రోజు వారీ వేతనం పెంచితే రూ.18 వేలుగా ఉన్న హోంగార్డుల వేతనం రూ.21 వేలకు చేరుతుంది. దీనివల్ల దాదాపు 16,618 మంది హోంగార్డులకు మేలు జరుగుతుంది. మూడేళ్ల క్రితం జగన్ సర్కార్ రూ.600 నుంచి రూ.710కి పెంచుతూ ఉత్తర్వులిచ్చింది. దానిపై రాష్ట్ర పోలీసు సంక్షేమ సంఘం జగన్ సర్కారుకు అభినందనలు తెలిపింది. ఇంతవరకు అవి కార్యరూపం దాల్చలేదంటూ ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. హోంగార్డులకు పెంచిన రూ.110తో కలిపి మొత్తం రూ.710 అమలవుతుందా లేదా అనే దానిపై స్పష్టత ఇవ్వాలి. పుంగనూరులో పోలీసులపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డరంటూ పోలీసు సంక్షేమ సంఘం నేతలు హడావుడి చేశారు. ఇలాగైతే తాము విధులెలా నిర్వహించాలని ఆవేదన వ్యక్తంచేశారు. హోంగార్డుల వేతనాల పెంపు, వారి ప్రయోజనాలపై మాత్రం పోలీసు సంఘాలు నోరెత్తిన సందర్భాలు లేవు. తమతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని, వేతనాల పెంపుపై ప్రభుత్వం తీవ్ర వివక్ష, నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని హోంగార్డులు మండిపడుతున్నారు. తమకు వేతనాలు పెంచాలని, ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించాలని, లేకపోతే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హోంగార్డులు సున్నితంగా హెచ్చరిస్తున్నారు.

బోగస్ ఓట్లపై నువ్వా...నేనా

(మొదటిపేజీ తరువాయి)

గత నాలుగు సంవత్సరాలుగా చేర్చిన నకిలీ ఓట్లపై ఈసీ ఎందుకు పరిశీలన జరపదు ? తదితర అంశాలను భారత ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి చంద్రబాబు తీసుకురానున్నారు. మరోపక్క వైసీపీ కూడా ఎదురుదాడికి సిద్ధమవుతోంది. 2014నుంచి 2019వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు 60 లక్షల నకిలీ ఓట్లు పెద్దఎత్తున చేర్చారని, వాటినే తమ ప్రభుత్వ హయాంలో తొలగించామని సీఈసీకి ఫిర్యాదు చేసేందుకు ఆధారాలు సిద్ధం చేస్తున్నారు. కేవలం టీడీపీ దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకుందని, వాస్తవానికి 2019 నాటికి ఓటర్ల సంఖ్య 3,98,34,776 ఉండగా, ఈ ఏడాది మార్చి 31 నాటికి ఏపీ ఓటర్ల సంఖ్య 3,97,96, 678గా ఉందని కేంద్ర ఎన్నికల సంఘానికి, పూర్తి వివరాలు అందించేందుకు సిద్ధమయ్యారు. చంద్రబాబు కలిసిన రోజే వైసీపీ ఎంపీలకు గంట తేడాతో కేంద్ర ఎన్నికల సంఘం అపాయింట్‌మెంట్ ఖరారైంది. మొత్తానికి అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటాపోటీగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసేందుకు సిద్ధం కావడంతో బోగస్ ఓట్ల వివాదానికి ఇక దిల్లీ కేంద్రం కానుంది.

24 మందితో టీటీడీ కొత్త పాలకమండలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన పాలకమండలి 24 మంది సభ్యులతో ఏర్పడింది. ఈ జాబితాను టీటీడీ అధికారికంగా విడుదల చేసింది. కొద్దిరోజుల క్రితమే టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. టీటీడీ బోర్డు సభ్యులుగా ఎమ్మెల్యే కోటాలో సామినేని ఉదయభాను (జగ్గయ్యపేట), పొన్నాడ సతీష్ (ముమ్మిడివరం), తిప్పేస్వామి (మడకశిర), మాసీమ బాబు (కడప), యానాదయ్య (కడప), వై. సీతారామిరెడ్డి (కర్నూలు, మంత్రాలయం), సుబ్బరాజు (ఉంగుటూరు), నాగ సత్యం యాదవ్ (ఏలూరు)శిద్దా సుధీర్ (ప్రకాశం), అశ్వథామ నాయక్ (అనంతపురం), డాక్టర్ శంకర్ (తమిళనాడు), కృష్ణమూర్తి (తమిళనాడు), దేశ్‌పాండే (కర్నాటక), పెనక శరత్ చంద్రారెడ్డి (తెలంగాణ), సీతా రంజిత్ రెడ్డి (తెలంగాణ), అమోల్ కాలే (మహారాష్ట్ర), సౌరభ్ బోరా (మహారాష్ట్ర), మిలింద్ నర్వేకర్ (మహారాష్ట్ర), కేతన్ దేశాయ్, బోర సౌరభ్, మేకా శేషుబాబు, రాంరెడ్డి సాముల, బాలుసుబ్రమణియన్ పళనిస్వామి, ఎస్ఆర్ విశ్వనాథరెడ్డి సభ్యులుగా నియమితులయ్యారు. ఈసారి మహారాష్ట్ర నుంచి ఏకంగా ముగ్గుర్ని సభ్యులుగా తీసుకున్నారు. తెలంగాణ నుంచి ఇద్దరికి మాత్రమే అవకాశం దక్కింది. ఈ సభ్యులంతా దేవాలయం ఆధ్యాత్మిక పవిత్రత, ఆర్థిక పారదర్శకత.. సమర్థవంతమైన పనితీరును నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తారు. కాగా, టీటీడీ చైర్మన్‌గా జంగా కృష్ణమూర్తి పేరు పెద్ద ఎత్తున ప్రచారం కాగా.. చివరికి బోర్డులో కూడా చోటు దక్కలేదు.

మణిపూర్ సీబీఐ కేసులు అసోంకు బదిలీ: సుప్రీం

న్యూదిల్లీ: మణిపూర్ హింసపై సీబీఐ దర్యాప్తు చేస్తున్న కేసుల విచారణను అసోంకు బదిలీ చేస్తున్నట్లు సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. ఈ కేసుల విచారణకుగాను ఒకరు లేదా ఇద్దరు న్యాయమూర్తులను నియమించాలని గువహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. నిందితులను ప్రవేశపెట్టడం, రిమాండ్, జ్యుడిషియల్ కస్టడీకి సంబంధించి న్యాయపరమైన ప్రక్రియను గువహతి హైకోర్టు ఆన్‌లైన్ ద్వారా విచారణ చేపట్టవచ్చని సూచించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో హాజరు కావడానికి ఇష్టంలేకపోతే బాధితులు, సాక్షులు నేరుగా గువహతి హైకోర్టుకు హాజరు కావచ్చని సీజేఐ స్పష్టంచేశారు. గువహతి కోర్టు ఆన్‌లైన్ ద్వారా సీబీఐ కేసులు విచారణ చేసేందుకు అవసరమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండాలే చూడాలని మణిపూర్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. మణిపూర్‌లో హింసకు సంబంధించిన బాధితుల సహాయ, పునరావాస కార్యక్రమాలను పరిశీలించేందుకు జస్టిస్ గీతా మిట్టల్ కమిటీని ఆగస్టు 21న సుప్రీంకోర్టు నియమించింది. ఇద్దరు మహిళలను నగ్నంగా పట్టపగలు నడిబజారులో ఊరేగించిన కేసుతో పాటు మొత్తం 10 కేసులను సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

త్వరలో హిండెన్‌బర్గ్ తరహా మరో నివేదిక...?

న్యూదిల్లీ: అదానీ గ్రూప్ తన షేర్లలో అవతవకలకు పాల్పడుతుందని అమెరికాకు చెందిన పెట్టుబడుల పరిశోధక సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక... భారతీయ స్టాక్ మార్కెట్లను ఎలా కుదిపేసిందో తెలిసిందే. ఇది దేశవ్యాప్తంగా.. అటు పార్లమెంట్‌ను సైతం ఊపిరాడకుండా చేసింది, తాజాగా హిండెన్‌బర్గ్ తరహా మరో సంస్థ భారత కార్పొరేట్ల ఆర్థిక అవకతవకలపై త్వరలోనే నివేదిక విడుదల చేయనున్నట్లు సమాచారం. రాక్‌ఫెల్లర్స్ బ్రదర్స్ ఫండ్, హంగేరియన్-అమెరికన్ పారిశ్రామికవేత్త జార్జ్ సోరోస్ వంటి ప్రముఖుల ఫండింగ్‌తో నడుస్తున్న ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్‌పీ) భారతదేశంలోని కొన్ని కార్పొరేట్ సంస్థల అక్రమాలను బయటపెట్టబోతుందని వార్తలు వస్తున్నాయి. ఆ సంస్థల షేర్లలో విదేశీ ఫండ్ల పెట్టుబడులకు సంబంధించిన అవకతవకలను బట్టబయలు చేయబోతోందని భావిస్తున్నారు. పరిశోధనాత్మక కథనాలు వెలువరించే సంస్థగా ఓసీసీఆర్‌పీ పేరు సంపాదించింది. ఈ సంస్థ 2006లో ప్రారంభమైంది. జార్జ్ సోరోస్, ఓక్ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్, రాకెఫెల్లర్ సంస్థలు ఇందులో పెట్టుబడులు పెట్టాయి. వ్యవస్థీకృత నేరాలపై నివేదికలు అందిస్తుందీ సంస్థ. మీడియా సంస్థల భాగస్వామ్యం ద్వారా ఈ వార్తా కథనాలు ప్రచురిస్తుంది. యూరప్, ఆఫ్రికా, అమెరికా , లాటిన్ అమెరికా దేశాలకు విస్తరించి ఉంది. ఓసీసీఆర్‌పీ ఏఏ కంపెనీల గురించి నివేదికలు ఇస్తుందనే వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ విషయంపై ఓసీసీఆర్‌పీ ఇంకా స్పందించాల్సి ఉంది.

మూడేళ్లలో గిరిజన వర్సిటీ

సీఎం వైఎస్ జగన్

విజయనగరం జిల్లాలో కేంద్రమంత్రితో కలిసి శంకుస్థాపన

ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో నిర్మిస్తాం: ధర్మేంద్రప్రధాన్

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గంలో రూ.834 కోట్లతో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ నిర్మాణ పనులకు శుక్రవారం కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సాలూరు నియోజకవర్గ పరిధిలోని మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం దత్తిరాజేరు మండలం మరడాం వద్ద ఏర్పాటు బహిరంగ సభలో విద్యార్థులను, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ధరేంద్రప్రధాన్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ మన్యం వీరుడు అల్లూరి పుట్టిన ప్రాంత మన్నారు. అలాగే ఇటీవల విజయవంతమైన చంద్రయాన్ సైతం రాష్ట్రంలోని శ్రీహరికోట నుంచే ప్రయోగించడం జరిగిందన్నారు. గిరిజన విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం 500ఎకరాలు భూమి అందించిందన్నారు. గిరిజన ప్రాంతంలో విశ్వ విద్యాలయం పెట్టడం వల్ల ఒడిశా, చత్తీస్‌గఢ్ లకు కూడా ఉపయోగమని ప్రధాని భావించారని తెలిపారు. ఈ విశ్వ విద్యాలయం... విద్య, సాంకేతికత అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. ఒడిశా విశ్వ విద్యాలయంతో పరస్పరం కలిసి పనిచేయాలని వీసీ కట్టమణికి కేంద్ర మంత్రి సూచించారు. విశ్వ విద్యాలయం ఆరులైన్ల రహదారితో అనుసంధానమవుతుందని, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతో సరిపోలే విధంగా రూపొందు తుందన్నారు. గిరిజన విద్య, వైద్యం తదితర మౌలిక సదు పాయాలకు కోట్లాది రూపాయలను కేంద్రం అందిస్తోందని తెలిపారు. భవిష్యత్‌లో భారత్ ప్రపంచానికి దిక్సూచి అవుతుందన్నారు. 2040నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర గిరిజన విశ్వ విద్యాలయాన్ని మూడు సంవత్సరాలలో పూర్తి చేసి జాతికి అంకితం చేయబోతున్నామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టును మంజూరు చేసినందుకు ఈ వేదికపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం మనకు విశ్వ విద్యాలయం వచ్చిందన్నారు. తనను గుండెల్లో పెట్టుకున్న గిరిజనులకు రుణపడి ఉంటానన్నారు. రాష్ట్రంలో 3 మెడికల్ కాలేజీలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గిరిజన ప్రాంతానికి గేట్‌వేగా ఉన్న నర్సీపట్నం లో ఒకటి, పాడేరులో మరో మెడికల్ కాలేజీ, పార్వతీపురంలో మూడో మెడికల్ కాలేజీ నిర్మాణం చేస్తున్నామన్నారు. కురుపాంలో ఒక ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణం జరుగుతోందన్నారు. వీటి ద్వారా ఈ ప్రాంతానికి ఎంత మంచి జరుగుతోందో ఆలోచన చేయాలని కోరారు. ఎస్టీల కష్టాలు, కన్నీళ్లు తెలిసిన మనిషిగా... ఎస్టీలకు మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి ఒక్క హామీ అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గిరిజన తండాల్లో నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చామని, 2019 జూలై నుంచి ఇప్పటివరకు 4.58 లక్షల గిరిజన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం రూ. 410 కోట్లు ఖర్చు చేశామన్నారు. గిరిజన తండాల జనాభా 500 ఉంటే పంచాయతీలుగా మార్పు చేస్తామని చెప్పిన మాట నిల బెట్టుకుంటూ... ఇప్పటికే 165 గిరిజన గ్రామ పంచాయ తీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఐటీడీఏ పరిధిలో మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ నిర్మిస్తామని మాట ఇచ్చామని, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, పార్వతీపురంలో, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవం, ఏలూరు జిల్లా బుట్టాయగూడెం, ప్రకాశం జిల్లా దోర్నాలలో రూ. 250 కోట్లు ఖర్చు చేస్తూ మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గిరిజనుల వరకు మాత్రమే చూస్తే 50 నెలల పాలనలో 36.12 లక్షల గిరిజన కుటుంబాలకు ప్రయోజనం కలిగిస్తూ... రూ.11,548 కోట్లు డీబీటీ ద్వారా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి పోతోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర, కలెక్టర్ నాగలక్ష్మి, గిరిజన విశ్వ విద్యాలయం వీసీ కట్టమణి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె. శ్యామలరావు, ఎమ్మెల్సీలు సురేష్ బాబు, రఘురాజు, ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య, శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, పుష్ప శ్రీవాణి, ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్ శంకరరావు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఐ నేతల ముందస్తు అరెస్టు

వినతులు ఇవ్వడానికి వెళుతుంటే పోలీసుల అడ్డగింత

విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తున్న సీపీఐ విజయనగరం జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, మరో నాయకుడు అలమండ ఆనందరావుని రామభద్రపురం వద్ద పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. అక్కడ నుంచి వారిని బాడంగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై రమణ స్పందిస్తూ ప్రజా సమస్యలపై వినతులు ఇవ్వడానికి వెళ్తే అడ్డుకోవడమేమిటని ప్రశ్నించారు. రమణ, ఆనందరావు విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తానని, ప్రభుత్వరంగ పరిశ్రమలను అభివృద్ధి చేస్తానని వైఎస్ జగన్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తామన్నారన్నారు. గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు వస్తున్న ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాలు తీసుకెళ్లే ఉద్దేశంతో తాము వెళుతున్నామని, కానీ పోలీసులు ముందుగానే తమను అదుపులోకి తీసుకోవడం అన్యాయమన్నారు. ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తోందని, ఇటువంటి అరెస్టులకు భయపడేది లేదని ఒమ్మి రమణ స్పష్టంచేశారు. అలమండ ఆనందరావు మాట్లాడుతూ ప్రజల ఖాతాల్లో రూ.5 వేలు, రూ.10 వేలు వేసి ఓట్ల కొనుగోలుకు సీఎం జగన్ రంగం సిద్ధం చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ముఖ్యమంత్రికి ప్రజలపై నిజమైన ప్రేమ ఉంటే కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, ప్రతి పేదవాడికీ రెండెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పుడే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని, అభివృద్ధి కనిపిస్తుందని చెప్పారు. ప్రజల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులను అరెస్టు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు.

బీజేపీని గద్దె దించుదాం

ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకుందాం

గోదావరిఖని సభలో అమర్‌జిత్ కౌర్ పిలుపు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి/సింగరేణి: సమరశీల పోరాటాలతో ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకోవాలని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ 16వ మహాసభల సందర్భంగా గోదావరిఖనిలో శుక్రవారం జరిగిన బహిరంగసభలో ఆమె ప్రసంగించారు. కార్మిక, రైతు సంఘాలు ఇటీవల సమావేశమై ప్రభుత్వ రంగాన్ని రక్షించుకోవాలని డిక్లరేషన్ విడుదల చేశాయని, దాని అమలు కోసం పోరాటాలను తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందని అమర్‌జిత్ కౌర్ చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశ వనరులను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు మోదీ ప్రభుత్వం కారుచౌకగా కట్టబెడుతోందని ఆమె విమర్శించారు. దేశంలో ధనిక, పేద వ్యత్యాసాలు పెరిగాయని, కార్మికవర్గం హక్కులను కాలరాస్తున్నారని, చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా మారుస్తున్నారని మండిపడ్డారు. అవినీతి విశృంఖలమైందని, నేరాలకు అంతం కనిపించడం లేదని, మత విద్వేషాలు పతాకస్థాయికి చేరాయని నిశితంగా విమర్శించారు. ఇందుకు కారణమైన మోదీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించి తీరాలని కౌర్ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసఫ్, బాలరాజు, సింకావ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య తదితరులు మాట్లాడారు.

భారీ ప్రదర్శన: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మహాసభల సందర్భంగా శుక్రవారం సాయంత్రం గోదావరిఖనిలో వేలాదిమంది కార్మికులతో భారీ ప్రదర్శన జరిగింది. మహాసభలు మూడురోజులపాటు జరుగుతాయి. ఈ ప్రదర్శనలో గోదావరిఖని ఆర్జీ వన్, టు, త్రీ, శ్రీరాంపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు తదితర ప్రాంతాల నుండి కార్మికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రెడ్‌షర్ట్ వలంటీర్లు, యూనియన్ అగ్రనాయకులు ప్రదర్శన ముందు నడవగా బ్యానర్లు, ఎర్రజెండాలతో కార్మికులు కదంతొక్కారు. ప్రజానాట్యమండలి కళాకారుల పాటలు మారుమోగాయి. ప్రదర్శన జీఎం మైదానం నుంచి ప్రారంభమై అంబేద్కర్, మున్సిపల్ చౌరస్తా, బజారు ఏరియా మీదుగా గాంధీ చౌరస్తా చేరుకుంది. కూనంనేని సాంబశివరావు, బాలరాజు, వి.సీతారామయ్య, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య ముందు వరుసలో నడవగా నాయకులు డి.శేషయ్య, కె.సారయ్య, కె.రాజకుమార్, ఎల్.ప్రకాశ్, వీరభద్రయ్య, బాజీ సైదా, వైవీ రావు, వెంకటస్వామి, వేల్పుల నారాయణ, మేరుగు రాజయ్య, కె.సమ్మయ్య, మద్దీ ఎల్లయ్య, ఆరెల్లి పోషం, కె.రాజారత్నం, బి.అన్నారావు, జి.గురు రవీందర్, జె.రాంచందర్, కొట్టె కిషన్‌రావు, మోటపలుకుల రమేశ్, ఎస్.సత్యనారాయణ, తిరుపతి, బయ్యి మొగిలి పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటాం...

సమీక్షలో సీఎస్ జవహర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రానున్న రోజుల్లో ప్రకృతి సేద్య విధానాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ప్రకృతి సేద్యం విస్తరణ, నిధుల సమీకరణ, ప్రకృతి సేద్యానికి సంబంధించి ప్రత్యేకంగా విశ్వ విద్యాలయం ఏర్పాటు అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి సేద్యాన్ని రైతులందరూ ఆచరించేలా వారిలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా మరిన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏడేళ్లుగా రాష్ట్రంలో ప్రకృతి సేద్యం సాగులో సాధించిన విజయాలను కలిగిన లాభాలపై రైతుల్లో తగిన అవగాహన కలిగించి రైతులందరూ ఈ విధానం కింద సాగు చేసేలా అన్ని విధాలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులు ప్రకృతి సేద్యం విధానాన్ని పాటిస్తూ ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గిస్తే ప్రధానమంత్రి ప్రాణం పథకం కింద పెద్దఎత్తున సబ్సిడీని పొందవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, రైతు సాధికార సంస్థ సీఈఓ బీ.రామారావు పాల్గొనగా, వీడియో లింక్ ద్వారా ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్. గుల్జార్, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ హాజరయ్యారు.

కాకినాడ-శ్రీకాకుళం గ్యాస్ పైపులైను పనులు వేగవంతం చేయండి: సీఎస్

కాకినాడ-శ్రీకాకుళం మధ్య ఏర్పాటు చేస్తున్న నాచురల్ గ్యాస్ పైపులైను పనుల్ని వేగవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి చెప్పారు. శుక్రవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఈ అంశంపై ఆయన అధికారులతో సమీక్షించారు.వచ్చే ఏడాది జూన్ నాటికి ఈపైపు లైనును ఏర్పాటు చేయాల్సి ఉన్నందున పనులు వేగవంతంగా చేయాలన్నారు. ఈ పైపు లైను ఏర్పాటుకు సంబంధించిన ప్రగతిని, వివిధ అంశాలను రాష్ట్ర ఇండస్ట్రీస్, ఇన్వెస్టుమెంట్స్ శాఖ (ఐఅండ్ఐ) కార్యదర్శి ఎన్.యువరాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఉభయ గోదావరి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న గోదావరి గ్యాస్ పైపు లైను డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్కు ప్రాజెక్టుకు సంబంధించిన ప్రగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ కే.ప్రవీణ్ కుమార్, ఏపీ మారిటైం బోర్డు డిప్యూటీ సీఈఓ రవీంద్రనాథ్ రెడ్డి వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ బహిరంగ సభ జయప్రదం చెయ్యండి

హరినాథరెడ్డి పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 8 న తిరుపతి నగరంలో సీపీఐ అధ్వ ర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చెయ్యాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పీ హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ తిరుపతి జిల్లా సమితి సమావేశం శుక్రవారం విశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. సమస్యల పై ప్రశ్నించిన దళితులు, మహిళలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు.ప్రాజెక్టుల నిర్మాణాలపై ప్రధానంగా పోలవరం పూర్తి చేసే చిత్తశుద్ధి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహరెడ్డికి లేదన్నారు. యువతకు ఉద్యోగం అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శిం చారు. ఉన్న పరిశ్రమల పై కూడా కక్ష కట్టి ఇతర రాష్ట్రాలకు తరిమేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేన న్నారు.రాష్ట్ర విభజన హక్కుల్ని సాధించడంలో విఫలమయ్యారని చెప్పారు. అమరావతి లో కూర్చొని బటన్ నొక్కే జగన్‌కు భయం పుట్టడంతో రాష్ట్రం మొత్తం తిరుగుతూ బటన్ నొక్కే కార్యక్రమం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కుల్ని కాలరాస్తూ నిరంకుశ ధోరణి తో పాలన కొనసాగిస్తోందన్నారు. అధ్యక్ష పాలన తీసుకొచ్చే తరహాలో అడుగులు వేస్తోందన్నారు మణిపూర్ లో మూడు నెలలు గా జరుగున్న అరాచకాలు, మారణకాండపై ప్రధాని మోదీ కన్నెత్తి చూడకుండా ఏవిధంగా స్పందిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నా రన్నారు. పార్లమెంటు లో సుమారు ఒకటిన్నర గంటలు చర్చలు జరిగినా మణిపూర్ ఘటన పై ఐదు నిమిషాలు ప్రస్తావన తో ముగించా రన్నారు.ఇలాంటి కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక పాలన పై ప్రజా చైతన్యం కోసం, ప్రజా సమస్యలే ప్రధాన అజెండా గా సీపీఐ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సీపీఐ అధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 8 న తిరుపతిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమనికి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, కార్యదర్శులు నారాయణ, సీపీఐ పార్లమెంట్ సభ్యులు వినయ్ విశ్వం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభను జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం, వైఎస్సార్ సాఫల్య పురస్కారం-2023కు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 31 న ముగియనుందని హైపవర్ కమిటీ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రజా సేవలో ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, సంస్థలు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలతో రాష్ట్ర ప్రభుత్వం సత్కరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారాల తరహాలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైఎస్సార్ పురస్కారాలను అందజేస్తోందని వివరించారు. దరఖాస్తు చేసుకునే వ్యక్తులు, సంస్థలు తమ విజయాలు, సేవలు గురించి ఒక పేజీకి మించకుండా సమాచారాన్ని అందించాలని, వారి ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ వంటి వివరాలు పొందుపరచాలని ఆయన స్పష్టం చేశారు. నామినేషన్లపై ఎలాంటి పరిమితిలేనందున పైన పేర్కొన్న రంగాల్లో ఎన్ని ఎంట్రీలైనా నమోదు చేసుకోవచ్చని, నామినేషన్లు స్వీకరించడానికి చివరి తేదీ 31 ఆగష్టు, 2023 అని ఆయన పేర్కొన్నారు.

నామినేషన్లకు అర్హులు..

కళలు, సామాజిక సేవ, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, స్పోర్ట్స్ తదితర రంగాల్లోను, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వ్యక్తులతో పాటు గ్రామాల్లో, మురికివాడల్లో పనిచేస్తూ సరైన గుర్తింపు పొందని రాష్ట్రానికి చెందిన వ్యక్తులు, పొలిటికల్ ఎన్జీవోలు, స్వచ్ఛంద సేవా సంస్థలు. చరిత్రలో పేరుగాంచిన సంస్థలు, సంఘాలు కూడా ఈ నామినేషన్లకు అర్హులని తెలిపారు.

దళితులతో జగన్‌ది రక్త సంబంధం: జూపూడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దళితుల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్ చెరగని ముద్రవేశారని, దళితులతో జగన్‌ది రక్తసంబంధమని, అసైన్డ్ భూములకు హక్కులు కల్పించి వారికి వెన్నుదన్నుగా నిలిచారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుడు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్ కొనియాడారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా జగన్‌ను పనికట్టుకుని దుష్ప్రచారం చేస్తుందన్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబును ప్రశ్నించే దమ్ము రామోజీరావుకు లేదన్నారు. అసైన్డ్ భూములను ఆక్రమించి రామోజీ ఫిల్మ్‌సిటీ కట్టలేదా అని నిలదీశారు. దళితులు కళ్లుతెరిస్తే ఫిల్మ్‌సిటీని దున్నేస్తారన్నారు. సీఎం జగన్ ఇంట్లో వారి మేనత్తలంతా ఎస్సీ కులస్తుల్నే వివాహాలు చేసుకున్న పరిస్థితు లున్నాయని, ఇది రక్త సంబంధంతో ముడివేసుకున్న బంధమని అని వివరించారు. వారితో రక్తసంబంధం ముడివేసుకున్న బంధం ఉంది కనుకనే దళితుల్ని కంటికి రెప్పలా చూసుకుం టున్నారన్నారు. డీబీటీ ద్వారా రూ.2.31 లక్షల కోట్లు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో పంపిణీ చేశారన్నారు.

కడపలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 32వ షోరూం ప్రారంభం

విశాలాంధ్ర-కడప: ప్రముఖ షాపింగ్‌మాల్ సౌత్ ఇండియా తమ నూతన షోరూమ్‌ను నగరంలో ప్రారంభించింది. కడపతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారి జీవనశైలి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ శుక్రవారం నగరంలోని పటేల్ రోడ్డు, న్యూ బస్టాండ్ సమీపంలో తమ 32 షోరూమ్‌ను ఆవిష్కరించింది. కుటుంబంలోని అన్ని తరాలవారి అభిరుచులకు సరిపోయే షాపింగ్ అవసరాలు ఒకే చోట అందుబాటులో తెచ్చేందుకు నెలకొల్పిన షోరూమ్ ప్రారంభోత్సవానికి అతిథులుగా కడప మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సయిాద్ ముంతాజ్ బేగం, 13వ వార్డు కార్పొరేటర్ ఎం.రామలక్షణ రెడ్డి హాజరయ్యారు. ప్రముఖ సినీతార కుమారి పూజా హెగ్డే గారు జ్యోతి ప్రజ్వలనం చేసి, అనంతరం సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సర్వాంగ సుందరంగా రూపొందించిన 'గోల్డెన్ త్రెడ్' కేటలాగ్‌ను కూడా ఆమె ఆవిష్కరించారు. మీడియా ప్రతినిధులను ఉద్దేశించి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్ శ్రీ సురేశ్ సీర్ల మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేక బ్రాండ్‌గా ముద్ర వేసుకున్న సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని ముఖ్యమైన కేంద్రాలతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాలకు సైతం విస్తరించబోతోందని, రీటెైల్ రంగానికి సంబంధించినంత వరకు నాణ్యతలో, సరసమైన ధరలలో సరిసాటిలేని వస్త్రాభరణాల కలెక్షన్లను అందించడంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రథమ శ్రేణిలో ఉందని పేర్కొన్నారు.

పేదలపై పోలీసుల ప్రతాపం

ఇళ్ల స్థలాల కోసం సీపీఐ అధ్వర్యంలో గిరిజనుల దీక్ష

ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

సీపీఐ నాయకులు, గిరిజనుల నిర్బంధం

విశాలాంధ్ర-కురుపాం: ఇళ్ల స్థలాలు ఇవ్వాలని శాంతియుత పద్ధతుల్లో ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్న నిరుపేద గిరిజనులపై పోలీసులు ప్రతాపం చూపించారు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేద గిరిజనులు సీపీఐ అధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. మూడవరోజు శుక్రవారం నిరసన దీక్ష కోసం ర్యాలీగా గుమ్మలక్ష్మీపురం తహసిల్దార్ కార్యాలయం వద్దకు వెళుతుండగా... నేరేడుమానుగూడెం వద్ద సీపీఐ నాయకులు, గిరిజనులను పోలీసులు అడ్డుకుని నిర్బంధించారు. పోలీసుల వైఖరిని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న తీవ్రంగా ఖండించారు. ఇళ్ల స్థలాలు సాధించేవరకు పోరాడతామని స్పష్టం చేశారు. గుమ్మలక్ష్మీపురం తహసిల్దార్ ఆఫీస్ వద్ద నిరాహార దీక్షకు పాదయాత్ర గా వెళుతున్న గిరిజనులను నేరేడుమాను వద్ద పోలీసులు అడ్డుకొని రోజంతా నిర్బంధించారని, ఇది గిరిజనుల స్వేచ్ఛను హరించడమేనన్నారు. మండల తహసిల్దార్ కనీసం గిరిజన సమస్యలు వినడానికి కూడా సిద్ధంగా లేరన్నారు. ఇళ్ల స్థలాలు అడిగితే ఇంకేదో విషయాలు చెబుతున్నారన్నారు. గత మూడు నెలల నుండి మండల కేంద్రంలో ఉన్న ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ అటవీ భూమిలో ఇళ్ల లేని గిరిజనులందరూ తుప్పలు, డొంకలు తొలగించి గుడిసెలు వేసుకుంటుండగా అటవీ పోలీసులు, మండల రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారని, గిరిజనులపై బైండోవర్, ఇతర కేసులు పెట్టారని చెప్పారు. అయితే ఇళ్ల లేని గిరిజనులంతా జిల్లా కలెక్టర్‌కి, ఐటీడీఏ పీఓకి, జాయింట్ కలెక్టర్‌కి, ఐటీడీఏ ఏపీఓకి, డీఆర్‌ఓకి, డీఎఫ్‌ఓకి వినతిపత్రాలు అందజేయగా... జిల్లా అధికారులు గుమ్మలక్ష్మీపురం మండల తహసిల్దార్‌కు ఫోను చేసి... ఇళ్ల లేని గిరిజనులందరికీ ఇళ్ల మంజూరు చేయాలని చెప్పినా కూడా సర్వేల పేరుతో నిర్లక్ష్యం చేయడంతో మూడు రోజులు పాటు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికైనా మండల తహసిల్దార్ స్పందించి ప్రభుత్వ భూమిని గిరిజనులకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ఏ భూమ్మీద అయితే తుప్పలు డొంకలు తొలగించామో, మరలా అదే భూమిపై గుడిసెలు వేసుకునే కార్యక్రమం చేపడతామని జీవన్న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సూరయ్య, ఇళ్ల స్థలాల పోరాట సాధన సమితి నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

బిడ్డ మరణంతో తల్లి ఆత్మహత్య

నెలరోజుల్లో కుటుంబంలోని ముగ్గురి మృతి

విశాలాంధ్ర-చింతపల్లి (అల్లూరి జిల్లా): నాలుగేళ్ల బిడ్డ ఆకస్మిక మరణంతో తల్ల డిల్లిన తల్లి ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి కుడుముసారి పంచాయతీ కరకపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గత నెలలో భర్త కొర్రా కామేశ్వరరావు అనారోగ్యంతో విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గురువారం రాత్రి కుమారుడు కొర్ర తేజ్(4) ఆకస్మికంగా మృతి మృతి చెందాడు. బిడ్డ మరణంతో మనోవేదనకు గురైన తల్లి కొర్ర బింగో (33) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. భర్త మరణించినప్పటికీ నాలుగేళ్ల కుమారుడుతో కలిసి జీవిస్తున్న బింగో... కుమారుడు కూడా దూరం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. భర్త, బిడ్డ కేవలం నెల వ్యవధిలో మృతి చెందడంతో తాను బ్రతికి ఏం సాధించగలనని భావించిన బింగో గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందనీ, గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం వలన గ్రామస్తులు డోలీ సహాయంతో ఆమెను తూరు బొంగుల గ్రామం వరకు తరలించి అక్కడ నుంచి లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లినట్లు ఆ గ్రామ సర్పంచ్ కాంతమ్మ చెప్పారు. అక్కడ వైద్యాధికారులు ప్రథమ చికిత్స అందించి చింతపల్లి సామాజిక ఆసుపత్రికి...అక్కడ నుంచి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాంతమ్మ మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో రహదారి సౌకర్యాలు లేక అనేక గ్రామాల గిరిజనులు అల్లాడుతున్నారని, గిరి గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తే అత్యవసర సమయాలలో ఆసుపత్రులకు వెళ్లేందుకు దోహదపడతా యన్నారు. నెలరోజుల్లోనే కుటుంబం మొత్తం మృత్యువాత పడటంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

సంపాదకీయం

చైనా అంటే అంత భయమా!

దక్షిణాఫ్రికాలోని జోహనెస్ బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ సమావేశంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధక్షుడు షీ జిన్‌పింగ్ తో గురువారం కొద్దిసేపు ముచ్చటించారట. 2020 జూన్ 15-16 అర్ధరాత్రి గల్వాన్ ప్రాంతంలో రెండు దేశాల సైన్యాలకు మధ్య జరిగిన ఘర్షణల్లో కనీసం 20 మంది భారత సైనికులు ప్రాణాలు అర్పించారు. మరో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు బెడిసి కొట్టాయి. ప్రధానమంత్రి మోదీ లాంఛనప్రాయంగా కాకపోయినా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తో సంభాషిస్తున్నప్పటికీ సరిహద్దులో శాంతి నెలకొనడం లేదు. చైనా భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చి స్థావరాలు ఏర్పరచుకుంటోంది. అయినా మోదీ ప్రభుత్వం ఈ వాస్తవాన్ని అంగీకరించకుండా దాచి పెడ్తోంది. అవసరమైతే చైనాతో కన్నెర్ర చేయగల సత్తా భారత్‌కు ఉందని మోదీ చెప్పే మాటలు బీరాలు పలకడానికే పరిమితం అవుతున్నాయి. జోహనెస్‌బర్గ్‌లో రెండు దేశాల అధినేతలు ముచ్చటించుకున్నప్పుడు సరిహద్దులో శాంతి కాపాడాలని అనుకున్నారట. దూసుకొస్తున్నది చైనా అయితే భారత్ శాంతిని కాపాడడం ఏమిటో అంతుపట్టదు. రెండు దేశాలు ఘర్షణపడ్తే సేనలను ఉపసంహరించుకుని శాంతిని పునరుద్ధరించే అవసరం వస్తుంది. జోహనెస్‌బర్గ్‌లో మోదీ, జిన్‌పింగ్ మధ్య సమావేశం గురించి కూడా భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. భారత్ కోరిక మేరకు జిన్‌పింగ్ ప్రధానమంత్రి మోదీతో ముచ్చటించారని చైనా వాదిస్తోంది. కాదు చైనా కోరిక మేరకే ఈ సంభాషణ జరిగిందని భారత విదేశాంగ కార్యదర్శి వినయ్ మోహన్ క్వత్రా చెప్తున్నారు. రెండుదేశాల వాదనలు నిజమయ్యే అవకాశం ఎటూలేదు. చొరవ ఎవరు చూపారన్నది అప్రస్తుతం. సరిహద్దులో చైనా ఆగడాలను ఆపడానికి మోదీ ప్రభుత్వం ఏం చేస్తోందన్నదే ముఖ్యం. ఆ విషయం గురించి మాత్రం సరైన సమాధానం రావడం లేదు. చైనా విషయానికి వచ్చేటప్పటికి భారత్ జంకుతోందన్న అభిప్రాయం కలుగుతోంది. చైనా నుంచి అందుతున్న సమాచారం కూడా సందిగ్ధంగానే ఉంది. రెండు దేశాల నాయకులు నిక్కచ్చిగా, నిష్కపటంగా మాట్లాడుకున్నారని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అంటోంది. ఇక్కడ కపటం భారత్ వేపున ఎప్పుడూలేదు. అదేమైనా ఉంటే చైనా నుంచే ఉండాలి. మోదీ చైనా అధినేతతో నిక్కచ్చిగా మాట్లాడగలిగిన సాహసంచేసి ఉంటే భారత చైనా సరిహద్దులో చైనా కవ్వింపు చర్యలు త్వరలో ఆగిపోవాలి. కానీ ఆ సూచనే కనిపించడం లేదు. వివిధ దేశాధినేతలతో తనకున్న మైత్రి గురించి మోదీ గొప్పగా చెప్పుకుంటారు. చైనా అధినేతతో కలిసి ఉయ్యాలలూగారు. అంత సాన్నిహిత్యమే ఉంటే సరిహద్దులను కాపాడుకునే విధంగా చైనాతో నిర్మొహమాటంగా మాట్లాడడానికి అడ్డంకి ఏమిటో ప్రధానమంత్రి మోదీ చెప్పరు. విదేశాంగమంత్రిత్వశాఖ అసలే చెప్పదు. అంటే ఏదో దాచిపెడ్తున్నారన్న అనుమానాలు అంతకంతకూ బలపడుతున్నాయి. ఇది మన బలహీనతనే చాటుతుంది. రెండు దేశాల నాయకుల మధ్య సంభాషణల గురించి చైనా విదేశాంగ అధికార ప్రతినిధి వాంగ్ వెన్ బిన్ గురువారం విడుదల చేసిన ప్రకటన కూడా పూర్తిగా దౌత్య పరిభాషలో ఉంది తప్ప వాస్తవ సమాచారం పూజ్యమే. ఇద్దరు నాయకులు లోతుగా మాట్లాడుకున్నారని మాత్రం తెలియజేశారు. అంత లోతుగా సంభాషణ జరిగి ఉంటే సరిహద్దులో చైనా దూకుడుకు కళ్లెంపడే అవకాశం సమీప భవిష్యత్తులోనైనా ఉండాలిగా! "భారత-చైనా సంబంధాలు రెండు దేశాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలి. శాంతికి, సుస్థిరతకు, ఈ ప్రాంతమేకాక ప్రపంచ అభివృద్ధికి తోడ్పడాలి" అని జిన్‌పింగ్ అన్నారని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటనలో తెలియజేశారు. ఇవి తేనెపూసిన పలుకులే తప్ప భారత్ ఎదుర్కుంటున్న సమస్యకు పరిష్కారంకావు.

గల్వాన్ సంఘటన జరిగిన తరవాత కూడా బాలీలో జి20 దేశాల సమావేశంలో కూడా భారత-చైనా అధినేతలు ముచ్చటించుకున్నారు. ఫలితమే అగోచరం. "సరిహద్దు ప్రాంతాలలో శాంతి, సామరస్యాలు ఉండాలి. వాస్తవాధీనరేఖ దగ్గర శాంతి నెలకొనడం భారత-చైనా దేశాల మధ్య సత్సంబంధాలకు అవసరం" అని మోదీ అన్నారట. అసలు సమస్య చైనా వాస్తవాధీన రేఖను అధిగమించడంలోనే ఉంది. చైనా మన దేశంలో చొరబడలేదు అని మోదీ ప్రభుత్వం ఇంతకాలంగా వాదిస్తోంది. ఏ సమస్యా లేకపోతే శాంతి సామరస్యాలు నెలకొనాలని మోదీ ఎందుకు చెప్తున్నట్టు అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ఈ ప్రశ్నకు సమాధానం భారత ప్రభుత్వం నుంచి రాకపోవడమే అసలు సమస్య. 2020 జూన్ లో గల్వాన్ సంఘటన జరిగినప్పటి నుంచే రెండు దేశాల మధ్య సంబంధాలకు విఘాతం కలిగింది. ఇది నిజానికి రెండు దేశాల సైనికుల మధ్య ఘర్షణే. దశాబ్దాలుగా ఏనాగూ జరగంది గల్వాన్‌లోనే సంఘటన జరిగింది. ఈ ఘర్షణను, ఒక కల్నల్‌తో సహా 20మంది భారత సైనికుల ప్రాణత్యాగాన్ని మోదీ ప్రభుత్వం కప్పిపుచ్చలేక పోయింది. కానీ ఆ తరవాత పరిస్థితిని చక్కదిద్దడానికి చేసింది, చేస్తున్నది ఏమీ కనిపించడంలేదు. అయితే రెండు దేశాల సైనికాధికారుల మధ్య సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవలే 19వసారి కమాండర్ల స్థాయిలో చర్చలు జరిగాయి. ఇది శాంతి వెల్లి విరుస్తోందనడానికి సంకేతమైతేకాదు. ఇందులోనూ ఒక మతలబు ఉంది. అపరిష్కృతంగాఉన్న సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోవడానికి రెండు పక్షాలూ అంగీకరించాయని విదేశాంగ మంత్రిత్వశాఖ చెప్తోంది. అంటే ఇటీవలి చైనా దూకుడును దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల చాటున దాచేయాలన్న ప్రయత్నం జరుగుతోందనే అనుకోవాలి. సైనిక, దౌత్యస్థాయిలో చర్చలు కొనసాగించవలసిన అవసరం ఉందని కూడా విదేశాంగ మంత్రిత్వశాఖ సన్నాయి నొక్కులు నొక్కుతోంది. ఇదంతా చైనా అంటే మోదీ సర్కారు గుండెల్లో గూడుకట్టుకున్న భయానికే నిదర్శనం. ఇండొనేషియాలో జి20 సమావేశం జరిగినప్పుడు మోదీ, జిన్‌పింగ్ గట్టిగా చేతులు కలుపుతున్న వీడియో అప్పుడే బయటికి వచ్చింది. సాధారణంగా చిన్న చిన్న సంఘటనలను కూడా తన ట్విట్టర్ ఖాతా ద్వారా చాటిచెప్పే మోదీ ఈ వీడియో గురించి మాత్రం మౌనంగానే ఉన్నారు. అక్టోబర్ 2019లో షీ జిన్‌పింగ్ మహాబలిపురం వచ్చారు. అది లాంఛన ప్రాయమైన సమావేశం కాకపోవచ్చు. అలాగే 2022 సెప్టెంబర్‌లోనూ రెండుదేశాల అధినేతల మధ్య ఉజ్బెకిస్తాన్‌లోని సమర్ ఖండ్‌లో చర్చలు జరిగాయి. మోదీ ఇన్నిసార్లు చైనా అధినేతను కలుసుకుంటున్నా అసలు సమస్య మాత్రమే అలాగే కొనసాగుతోంది. జిన్‌పింగ్ తో మోదీకి ఉన్న స్నేహం వ్యక్తిగతమైంది కావడానికి వీలులేదు. ఆ స్నేహంవల్ల భారత ప్రజలకు మేలు కలగాలి. ఆ ఛాయలేలేవు. ఏమీ తేల్చని చర్చలు నిష్ప్రయోజనకరమే.

తిరగబడనున్న మోదీ-షాల బండి

అరుణ్ శ్రీ వాస్తవ

ప్రధాని నరేంద్ర మోదీ ఆకర్షణశక్తి వేగంగా పడిపోతోందని ప్రజలు భావిస్తున్నారు. గతంలో బీజేపీలో చేరాలని తహతహలాడిన అనేకమంది నాయకులు ఇప్పుడు కాంగ్రెస్‌వైపు చూస్తున్నారు. 2024లో లోకసభకు ఎన్నికలు జరుగుతున్న తరుణంలో కాంగ్రెస్‌లో చేరేందుకు చాలామంది నాయకులు సిద్ధపడుతున్నారు. దీంతో మోదీ-షాల బండి తిరగబడేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. తమ రాజకీయ భవిష్యత్ కాంగ్రెస్‌తో ఉంటుందని అంచనా వేసుకుంటున్నారు. దీంతో మోదీ-షాల ప్రణాళిక బోల్తా పడనున్నది. బీజేపీలోనే కొనసాగితే తమ రాజకీయ భవిష్యత్ గోవిందా అని అనేకమంది ఆందోళన చెందుతున్నారు. ఏదో మాయచేసి మోదీ తిరిగి అధికారానికి వస్తారా అని కొందరు సందేహపడుతున్నారు. ఇదే జరిగితే అప్పుడు కొత్తగా భక్తులబృందం తయారుకావచ్చు. జనసంఘ్ 1980లో బీజేపీగా అవతరించిన తర్వాత మొదటిసారిగా పార్టీ నుంచి పెద్ద సంఖ్యలో వెళ్లిపోనున్నారని అంచనా. గతంలో ఏనాడు ఇలాంటి పరిస్థితిని పార్టీ ఎదుర్కోలేదని భావిస్తున్నారు. ఇప్పటి పరిస్థితిపై సీనియరు నాయకులు నోరువిప్పే సాహసం చేయడంలేదు. వీరి సలహాలను ఎవరూ కోరడంలేదు. ఉన్నతస్థాయిలో నిర్ణయాలు తీసుకునేవారు చేస్తున్న తప్పులను కూడా సీనియర్లు ప్రస్తావించకుండా మౌన ప్రేక్షకులుగా ఉన్నారు. ఒకనాటి కాంగ్రెస్‌లో నెలకొన్న పార్టీ గ్రూపులు, తగాదాలు, గొడవలు నేడు బీజేపీలో బలపడడానికి మోదీ-షాలే కారణమన్న అభిప్రాయాలు ఎక్కువగా ఉన్నాయి. పార్టీ నాయకత్వాన్ని మోదీ-షాలు స్వీకరించడానికి ముందు అంతర్గత ప్రజాస్వామ్యం ఉండేది. ఇప్పుడీపదానికి విలువ లేకుండా పోయింది. అసలు ఆచరణేలేదు. తాము ఉన్న పార్టీలకు ద్రోహంచేసి బీజేపీలో చేరినవారు దాదాపు అన్ని రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వాన్ని చేజిక్కించుకున్నారన్న అభిప్రాయం, నిరసన ఉన్నాయి. పశ్చిమబెంగాల్, బిహార్, అసోం, కర్ణాటక, యూపీ, మహారాష్ట్రలలో కొంతమేరకు బయటివాళ్లు కీలకస్థానాలు దక్కించుకున్నారని అసమ్మతిని వ్యక్తం చేస్తున్నారు. సీనియరు నాయకులు, పార్టీకి కట్టుబడి ఉన్న వాళ్లకు ప్రాధాన్యతలేదు. వీళ్లమాట వినేవారులేరు.

క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, పార్టీ నాయకుల పరిస్థితి ఏమీ బాగాలేదంటున్నారు. అంతేకాదు, దాదాపు అన్ని రాష్ట్రాల్లో విశ్వసించదగిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను పక్కకుపెట్టారు. ఆర్ఎస్ఎస్ సీనియర్లు, కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. బీజేపీతో సమన్వయం

దెబ్బతినిపోయింది. రాష్ట్రస్థాయి ఆర్ఎస్ఎస్ నాయకులు కూడా మోహన్ భగవత్ మౌనంగా ఉండటంపై ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నారు. మోదీ-షాల చర్యలను భగవత్ సానుకూలంగా చూస్తూ ఉన్నారని అభిప్రాయ పడుతున్నారు. ఆర్ఎస్ఎస్‌లో ఈ ప్రశ్న చర్చనీయాంశంగా ఉంది. మోదీ-షాలంటే భగవత్ భయపడుతున్నారన్న అభిప్రాయం కూడా ఆర్ఎస్ఎస్ సీనియరు నాయకులలో ఉంది. భయంగాకపోతే సంఘ్ నియమాలు పాటించాలని మోదీ-షాలను ఎందుకు ఆదేశించడంలేదని ఆర్ఎస్ఎస్ నాయకులు అంటున్నారు. మౌనంగా ఉంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను దెబ్బతీస్తుందని కూడా అనుకుంటున్నారు. ఆర్ఎస్ఎస్‌ను దెబ్బతీస్తుందని కూడా అనుకుంటున్నారు. ఆర్ఎస్ఎస్ కోరిక హిందూరాష్ట్ర ఏర్పాటుకు, మోదీ ప్రణాళికను ముందుకు తీసుకువెళుతున్నారని, అయితే ఆయన అనుసరించే ప్రతీకార రాజకీయాలు బీజేపీ పునాదిని క్షీణిస్తోందని అంటున్నారు. ఈ ఏడాది చివరకు ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో బీజేపీ అంతర్గత తగాదాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. మోదీ-షాలు కలిసి నష్టనివారణకు కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ తిరుగుబాటు దారులు మాటవినడంలేదు. తలెత్తుతున్న పరిస్థితులు బాగా ఆందోళన పరుస్తున్నాయి. భక్తులు, విధేయులు బహిరంగంగా విమర్శించకపోయినా టెలివిజన్‌లలో ఇచ్చే సూచనలు పెద్దగా పనిచేయడం లేదు. తిరుగుబాటు దారులపై చర్యలు తీసుకోవడం కూడా క్లిష్టంగా మారింది. భగవత్ తోడ్పాటున్నందున సిద్ధాంతపరమైన భావజాలానికి గుర్తింపు గురించి ఆలోచించవలసిన పనిలేదని మోదీ-షాలు భావిస్తున్నారు. ఎన్నికలు కొన్నినెలల్లో జరగనున్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లలో సంస్థాగత సమస్యలు, గ్రూపులు మధ్య తగాదాలు మరింత పెరిగాయి.

మధ్యప్రదేశ్ ఇప్పటికే అనేకమంది ప్రముఖ నాయకులు, బీజేపీ విధేయులు పార్టీనుండి బైటకు వెళ్లిపోయారు. జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో కాంగ్రెస్‌ను విడిచిపెట్టినవారిలో అత్యధికులు తిరిగి కాంగ్రెస్‌లో చేరిపోయారు. మధ్యప్రదేశ్ బీజేపీ కనీసం మూడు గ్రూపులు తగాదా పడుతున్నాయి. ఈ గ్రూపులకు సింధియా, శివరాజ్‌సింగ్ చౌహాన్, మోదీ భక్తులు నాయకత్వం వహిస్తున్నారు.

ఎన్నికల కమిషన్ షెడ్యూలు విడుదల చేయకముందే మధ్యప్రదేశ్‌లో బీజేపీ పోటీచేసే అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాతో విధేయులను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి ప్రాధాన్యతనిచ్చారు. దీంతో అనేకమంది భక్తులుసైతం నెలక్రితమే పార్టీని వదిలిపెట్టి కాంగ్రెస్‌లో చేరిపోయారు. మోదీని లెక్కచేయకుండా విధేయులు పార్టీని విడిచిపెడుతున్నారు. రాజస్థాన్‌లో వసుంధర రాజే సింధియా ప్రత్యర్థులు మోదీయే గ్రూపులకు కారణమని ఆరోపిస్తున్నారు. ఆయన విధేయులైన గజేంద్రసింగ్ షెకావత్, లోకసభ స్పీకరు ఓం బిర్లా, కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ కొత్త నాయకులుగా ముందుకువచ్చారు. వీరంతా విజయరాజే సింధియా తిరిగి ప్రముఖ నాయకురాలిగా రాజకీయ రంగంలోకి రాకూడదని గట్టిగా భావిస్తున్నారు. కొంతమంది మాత్రం విజయరాజేసింధియా ముఖ్యమంత్రి అభ్యర్థి కావాలని కోరుతున్నారు. ఇతర గ్రూపులు ఆమెను వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీలో ఆమె పేరులేదు. బిహార్‌లో పూర్వపు విధేయులపై ఆధారపడకుండా ఒక బృందాన్ని ఏర్పాటుచేశారు. తరచుగా పార్టీలుమారే సామ్రాట్ చౌదరిపై ఆధారపడాలని కేంద్రనాయకత్వం భావిస్తోంది. పాతతరం నాయకులు వీరికి వ్యతిరేకంగా ప్రకటనలు జారీ చేస్తున్నారు. చత్తీస్‌ఘడ్‌లో పరిస్థితి భిన్నంగాలేదు. మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌ను కాదని కొత్తవాళ్లకు బాధ్యత అప్పగించారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు 77ఏళ్ల గల నందసాయి 1980 నుంచి బీజేపీలో ఉన్నారు. ఆయన గిరిజన నాయకుడిగా ఉన్నారు. ఆయన నాలుగురోజుల క్రితమే ఇక పశ్చిమబెంగాల్‌లో విధేయులను పక్కనపెట్టి, పార్టీ మాజీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్‌కు ఎన్నికల బాధ్యత అప్పగించారు. తృణమూల్ కాంగ్రెస్ నుంచి వచ్చిన సువేందుపై అవినీతిపరుడన్న పేరుంది.

మామా... చందమామా...

త్రేతాయుగం నుంచి ఓ వెతుకులాట. ఓ వ్యక్తి జీవికననుసరించి దేవుడిగా కొలుస్తున్న దేశంలో రాముడు దేవుడిగా రూపాంతరం చెందిన కాలం నుంచి ఆ అందరాని చందమామే ఆయనకి, అందరికీ ఓ ఆలంబన. బాల రాముడు కూడా చంద్రుడు కావాలని మారాం చేసినప్పుడు అద్దంలోనే చూపించాల్సి వచ్చింది అయోధ్య రారాజు, తండ్రి పాత్రధారి దశరథుడికి. అలా అద్దానికో, బయోస్కోపులకో, ఆ చందమామ పంచే వెన్నెలకో ఆశ పడడం వినా అక్కడికిచేరి చందమామ చెలికాడిని చూసే భాగ్యం ఇంకా కాన రాలేదు. ఇదిగో ఇప్పుడే ఆ చందమామని అందని వాడు కాదని, అందరి వాడని ప్రపంచానికి తెలియజేశారు మన ఇస్రో శాస్త్రవేత్తలు. విక్రమ్ ల్యాండర్ చంద్రమండలంపై కాలుమోపింది. ఇక మన వ్యోమగాములు ఆక్కడ అడుగులు వేయడానికి ఇంకెంతో కాలం పట్టదేమో. బహుశా ఇది ముందే తెలిసినవాడు మన మహాకవి శ్రీశ్రీ గాంధారీ గర్వభంగం సినిమాలో ఓ పాటలో "పదునాలుగు లోకముల ఎదురన్నది లేదుగా... మానవుడే సర్వశక్తి భావుడుకదా... మనుష్యుడిల మహానుభావుడే చూడగా... మనుష్యుడిల మహానుభావుడే" అన్నారు. అవును మన శాస్త్రవేత్తలు మహానుభావులే. కాకపోతే.... "అందరాని చందమామా

చక్రవాకం
- ముక్కాముల చక్రధర్

నాకేందెకూ... అద్దంలాంటి నా మామ చాలు నాకు" అని పాటతోనే సంతృప్తిపడేవారికి మీ మామతో పాటు ఈ చందమామా ఉన్నాడు అని చేతల్లో చూపించారు. ఇక మన పిల్లలకు అద్దంలోనో, ఆకాశంలోనో చందమామని చూపించి గోరు ముద్దలు తినిపించాల్సిన పనిలేదు. చంకనెత్తుకున్న పిల్లలకి ఇస్రో ప్రయోగశాలనో, నేడో, రేపు ఆ గగనతలానికి పయనమయ్యేందుకు సిద్ధమవుతున్న వ్యోమగాములనో చూపించవచ్చు ఈ ఇలాతలంనుంచి. ఆ లోకంలో మన చిన్నారుల కోసం గోగుపూలు ఏరుకుంటున్న చంద్రుడు ఏ కొండఎక్కి వస్తున్నాడో, తన కూడా ఏ కుందేటి కొమ్మును తీసుకువస్తున్నాడో ఇక ముందు ముందు తెలుసుకోవచ్చు అక్కడినుంచి వచ్చే ఫొటోలను చూసి. "మామా... చందమామా... వినరావా నా కథ" అని బతిమిలాడుకోవల్సిన అవసరమూలేదు. అంతే కాదు... "మింటిపైన నీవు వొంటిగాడివై అందరికీ వెన్నెల పంచా రేయంత తిరగాలి... ఇంటిలోన నేను వొంటిగాడినై అందరికీ సేవలు చేయా రేయి పగలూ తిరగాలి... లేరు మనకు బంధువులు... లేరు తల్లిదండ్రులు" అని నిరాశ పడాల్సి పనీలేదు. అసలు అందరికీ వెన్నెలనీయా ఆ చందమామ ఒక్కడే తిరుగుతున్నాడో.... ఏ సహచరులతో బృంద పర్యటన చేస్తున్నాడోకూడా ఇక ముందు ముందు తెలిసిపోతుంది.

"చందురుని మించు అందమొలికించు... బుజ్జి పాపాయివే" అంటూ కానరాని చందమామ అందంతో మన పిల్లలను పోల్చాల్సిన పనీలేదు. అక్కడనుంచి వచ్చే ఆ చందురుడు కంటే మన పిల్లలు ఎంత అందంగా ఉంటారో ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. అసలు చంద్రుడిలోఉన్న ఆ మచ్చ ఆయన పుట్టినప్పటి నుంచో ఉన్నదో.... అతని అందానికి మురిసిపోయిన ఆకాశం దిష్టి సోకకుండా పెట్టిన ఓ మచ్చో కూడా మన శాస్త్రవేత్తలు కొద్దికాలంలో మనకి విడమరచి చేప్పేరోజు ఆకాశమంత దూరంలో లేదంటే లేదు. "నీళ్లులేని ఎడారిలో కన్నీరై తాగి బతకాలి" అనుకుంటూ ధైర్య వచనాలను చెప్పుకునే మనకు ఆ నిండు చందురునిలో అన్ని నీళ్లు ఎందుకున్నాయో.... ఆ నీటిని ఆయన ఎక్కడ నిక్షిప్తం చేసుకున్నాడో కూడా మన ఇస్రో శాస్త్రవేత్తలు అతి తక్కువ కాలంలోనే చెప్పయగలరు. నిజానికి వొంటరిగా ఉన్న వెన్నెలరేడు తనకు దొరికిన భారతీయుల స్నేహానుబంధానికి మురిసి తానే ఆ రహస్యం చెప్పేసినా ఆశ్చర్యంలేదు. ప్రేయసీ ప్రియులు ఆనాటి ఉత్తరాల్లోనో, నేటి వాట్సాప్ మెసేజ్‌ల్లోనో "చందమామ రమ్మంది చూడూ... చల్లగాలి రమ్మంది చూడు" అంటూ పాటలు పాడుతూ అబద్దాలుచెప్పే కాలం కాదిది. తనపై నిందలువేసి తప్పించుకుందుకు చూస్తే ఆ చందమామ ఊరుకునే రోజులూకావు. తన కొత్త ఇస్రో మిత్రులకు మీమీద ఫిర్యాదుచేసే అవకాశమూ ఉంది. ముఖ్యంగా తనపై ప్రేమ, కోపం, విరహం, అసూయ, ఇష్టాల పేరుతో ఏదేదో రాసేసిన, రాయాలనుకునే తెలుగు కవులను కూడా చందమామ తన చుట్టూ కక్ష్యలో తిరుగుతున్న విక్రమ్ ల్యాండర్ ద్వారా కక్ష తీర్చుకునే రోజులూ లేకపోలేదు. అన్నట్లు... మన పోలవరానికో.... రాజధాని నిర్మాణానికో...నాలుగువందల ఏళ్ల మహా చరిత్ర ఉన్న నగరాల సుందరీకరణకో చేసిన, చేస్తున్న లక్షలాది కోట్లు ఖర్చుకాలేదు ఈ చంద్రమండల యాత్రకి. కేవలం 650 కోట్ల రూపాయలతో ఈ అద్భుత కలను కళ్ల ముందుంచారు మన ఇస్రో శాస్త్రవేత్తలు. ఈ మేథావులు రాజకీయుల కాదు కదా...వొట్టి మధ్యతరగతి మనుషులు. వారి చూపుడు వేళ్ల మీద కూడా ఐదేళ్లకొక్కసారి సిరాచుక్క పడుతుంది. వందల కోట్ల దేశ ప్రజల మనసుల్లో ఆ శాస్త్రవేత్తల మీద జీవితకాల కృతజ్ఞత పుడుతుంది. అందుకే చందమామ మనకి దొరకలేదు... మనమే ఆయనకి దొరికిపోయామేమో...!?

సీనియర్ జర్నలిస్టు, 99129 19929

తెలంగాణలో మూతబడుతున్న డైట్ కళాశాలలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో త్వరలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. సుప్రీంకోర్టు ఇటీవల ప్రాథమిక పాఠశాలలలో బోధించే ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టులకు బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్ (బి.ఎడ్) వారు అర్హులుకారని ప్రకటించడంతో అనేక మంది బి.ఎడ్ చేసి ప్రాథమిక పాఠశాలలలో ఉపాధ్యాయ పోస్టులకు సిద్దమవుతున్నవారి పరిస్థితి అయోమయంగా మారింది. తెలంగాణలో ఉపాధ్యాయ శిక్షణాసంస్థల, విద్యాసంస్థల పరిస్థితి పరిశీలిస్తే ప్రశ్నార్థకంగా మారబోతున్న విషయం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. తెలంగాణలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) కళాశాలలను కేంద్రప్రభుత్వం మూతపడేటట్లు చేస్తుంది. ప్రతి సంవత్సరం అనేక వందల మందికి ఇంటర్మీడియట్ తర్వాత రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డి.ఎడ్) లో శిక్షణ తర్వాత టెట్ నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి డి.ఎస్సీ ద్వారా ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలలలో ఉపాధ్యాయులుగా నియమిస్తారు. గతంలో డిగ్రీ (బి.ఏ.,బి.కాం.,బి.ఎస్సీ.,బి.టెక్ తత్సమాన) విద్యార్హతలు కలిగిన వారికి బి.ఎడ్ (బ్యాచ్‌లర్ఇన్ ఎడ్యుకేషన్) పూర్తిచేసి టెట్ పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత డి.ఎస్సీ ద్వారా ప్రాథమిక, లేదా ఉన్నత పాఠశాలలలో బోధించే అవకాశం ఉండేది. సుప్రీంకోర్టు ప్రాథమిక పాఠశాలలలో బి.ఎడ్ వారికి అవకాశం లేదు. కేవలం డి.ఎడ్ వారికి మాత్రమే అవకాశం అని తీర్పు ఇవ్వడంతో డి.ఎడ్‌కు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది.

ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలు తెలంగాణ జిల్లాలలో ఉండేవి. హైదరాబాద్ డైట్ నేరేడ్‌మెట్‌లో, రంగారెడ్డి డైట్ వికారాబాద్‌లో మిగతా జిల్లాల డైట్ కళాశాలలు ఆయా జిల్లాల ప్రధాన కేంద్రాలలో ఉండి ప్రతి సంవత్సరం వేలమంది సుశిక్షితులైన ఉపాధ్యాయులను తయారుచేసేది. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు (ప్రస్తుతం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వారు) డైట్ కళాశాలలలో శిక్షణ పొందేవారు. డైట్ కళాశాలలు పాఠశాల విద్యాశాఖ పరిధిలోనే ఉంటాయి. 2023-24 విద్యా సంవత్సరంలో డైట్ కళాశాలలైన నేరెడ్ మెట్, వికారాబాద్,వరంగల్, ఖమ్మం మొదలైన డైట్‌లకు అనుమతి నిరాకరించడంతో అనేకమంది విద్యార్థులు, తల్లిదండ్రులు,పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనేకమంది ఎం.ఏ.,ఎం.ఎస్సీ.,బి.ఎడ్.,ఎం.ఎడ్., పిహెచ్.డిలు చేసి డైట్ కళాశాలల్లో ఉపన్యాసకులుగా అవకాశం వస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు నాలుగు, ఐదు పి.జిలు చేసి డైట్ కళాశాలల్లో ఉపన్యాసకుల నోటిఫికేషన్‌కోసం ఎదురు చూస్తున్నారు. కామన్ సర్వీస్ రూల్స్ కేసు తెలంగాణ అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో పెండింగ్‌లో ఉండడంతో గత 14,15 సంవత్సరాల నుండి ఉన్నత పాఠశాలలలో పనిచేస్తూ డైట్ కళాశాలల ఉపన్యాసకులకు ఉండవలసిన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పదోన్నతులు లేకుండా ఎదురు చూస్తున్నారు. డైట్ కళాశాలలకు 2023-24 విద్యా సంవత్సరంలో అనుమతిరాలేదని తెలియగానే మూలిగే నక్కపై బరువు పడిన సామెతగా ఉన్నత పాఠశాలలలో బోధిస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితి నెలకొంది. అనేకమంది ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్‌లుగా తెలంగాణ పాఠశాల విద్యశాఖలోచేరి స్కూల్ అసిస్టెంట్లుగా పదవీవిరమణ చేయాల్సి రావడం విచారించదగిన ఆందోళన కరమైన విషయం.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్, 9290826988

నారీమణుల విమర్శలు

ఈ దినము ఉపన్యాసకర్త రాలేదు. సభ వాయిదా వేయుదమన్న సభ్యులు యూరకుండరి. పొడుము ఖర్చుకై వెనుక ముందాడు చున్నారా? యని యొకరు, మీరు జెప్పనవి వేద వాక్యములా? ఏదియో ఒకటి జెప్పరాదా? యని యొకరు యనుచుండిరి. అంతట దాసు లేచి వేగవరము నుండి వెంకాయమ్మ గారు రాసిన ఉత్తరము ఇట్లు జదివెను. అయ్యా! ఎన్నికల సభలో ఇరువురు వనితలు చీరెల విషయము ముచ్చటించు కొనుచుండగా ఒక వెంకాయమ్మ పక్కున నవ్వి నవ్వు అపుకొనుటకు యత్నించినదని ఆక్షేపించిరి. విషయము తెలిసిన అటుల మాట్లాడువారుకాదు. సభ్యతాసంస్కారము, సభా మర్యాద తెలిసిన దాననగుటచే నవ్వు ఆపుకొనిన దానను. వేరొకచోట అయినచో పకపక నవ్వుదానను. పడిపడి నవ్వుదానను. పొర్లి పొర్లి నవ్వుదానను.

వాయిదాలకు నా యొద్ద చీరెలు కొని వాయిదా సొమ్ములు కట్టమనిన ఎంతలేసి మాటలాడినారు? "ఒక్క ఉతుకుకే రంగు వెలసినదని.. పీచు పీచయినదని పై మెరుగు పోయినదని... మసి బట్టయినదని... మోసపోతిమని చెప్పిన పడతులు అవియే ధర్మవరంలో కొన్న ధర్మవరం పట్టుచీరెయని యొకరు, మైసూరులో కొన్న జరీ చీరెయని యొకరు నిరాఘాట ప్రశంసా పత్రములందించుచుండ నవ్వక సాధ్యమగునా? పైకము కట్టమనిన యొక మాట... ప్రక్కన మరియొక మాట...ఓరకంటినొకమాట.. కోర జూపునొకమాట. ఆహా! మానవులలో ఎంత కపటత్వము. ఎంత జిత్తుల మారితనము. ఎంతటి హాస్యనటనా చతురత. ఎంత వినోద భరిత ప్రవర్తన. ఆడుదానికి ఆడది శత్రువు యందురు. మరి మీరేల నాపై కక్షగట్టినారు? వీధిన పడవేసినారు? వేలెత్తి జూపినారు. బజారున కీడ్చినారు. ఈడేరక మునుపే కట్టుకున్నవాడు కాటి ముఖము పట్టుటచే ప్రక్కదాపునొకనిని పెట్టుకొని గుట్టుగా బ్రతుకుచుంటినే. నాపేరు ఏల బయటకు దీయవలెను. ఇది మీకు తగునా? నా బ్రతుకేదో నాది. నా బాధలేవో నావి. నా సుఖమేదో నాది. మిమ్ము తీర్చవలెనని, ఆర్చవలెనని ఎన్నడైనా అడిగితినా? అడిగినా మీరు తీర్చువారా? కాదే! మరి యొక్క మారు ఇట్లు జేయుదురా? యని ఈడ్చి కొట్టువారు లేక ఈ రీతిన మాట్లాడుదురా? మర్యాద ఎరిగి మసలుకొనుడు. ఇట్లు... వెంకాయమ్మ. నాయినలారా! జూచితిరా. ఆ వెంకాయమ్మ గారెవరో నాకు తెలియదు. నేను ఆమెకు తెలియుటచే కాబోలు చెడమడ తిట్టినది. ఏదియో ఒక విషయము జెప్పునపుడు తోచిన పేరు పలుకుట గలదు. ఘుణాక్షర న్యాయముగా అటువంటి పేరు గల వారు ఒకరుండుట సంభవించినది. వెంకి పెళ్లి.. సుబ్బిచావు యందురు. ఆ నామధేయము గలవారు ఆక్షేపించిన ఆ నానుడి వుండునా? ఆమె తీరు ఆత్మన్యూనత, ఆధిపత్యము కలబోసి నట్లున్నది. ఈ తిట్లు మనపైకాదని, స్వీకరించుటకనర్హులమని భావించుట మేలు. హేలాపురి మహిళా సంఘము నుండి మరియొక్క ఉత్తరము వచ్చినది. చదివెదను. అయ్యా! ఎన్నికల సభలో మహిళల శిరోజములను మీరు ఈ తీరున వర్ణించినారు. "వాలు జడలవారు... వంకర పాపటవారు.. జిగిబిగి అల్లికవారు.. అల్లక వదిలినవారు." ఇది వర్ణనమా... వల్లకాటియా? వెటకారమా... వెక్కిరింతయా? మీ బుద్దులు తిన్నగున్నవని మమ్ము వెటకరింతురా? ఆడదన్న చులకన భావన మీలో గూడు కట్టుకొని యున్నది. మేము అభ్యంగన స్నానమాచరించిచో అరవిరబూసిన శిరోజములు మా అందము ద్విగుణీకృతము జేసిన ఆ తప్పు మాదికాదు. చూచుటలో యున్న మీ దృష్టి దోషము. మా జల్లెడ కొప్పులు చూసిన మీ ఒళ్ళు జలదరించుటయా? పొగచూరిన మా ముఖములకు రవంత పౌడరు అద్దిన ఇకిలించుటయా? ఆడది అందముగా అగుపడిన కళ్ళలో నిప్పులు పోసుకుందురు. జిల్లేడు మొగ్గలు దోపుకుందురు. మా నీడ మీకు పడదు. మా పొడ మీకు గిట్టదు. మా చదువు మీకు సరిపడదు. ఆడది గడప దాటి పోవలెనన్న గుర్రుమిరి జూతురు. ఆడుదానిని వంట ఇంటి కుందేలు జేసినారు. ఆడదానికి వంట ఇల్లే పాఠశాల. తిరగలి త్రిప్పుటే తెలుగు పాఠము. గుడ్డలుతుకుటే గణిత శాస్త్రము. నీళ్ళు తోడుటే నీతి శతకము. ఈ కుందేళ్ళే మీ వంటి కుక్కలను తరుమునని మరువకుడు. మమ్ము కాదని చదువులలో

మీరు సాధించినదేమి? విజ్ఞానము పెరిగినదా? లేదే! హృదయ వైశాల్యము పెంచినారు. దానితో రాష్ట్రాంతర, దేశాంతర యువతులను పెండ్లి యాడుచున్నారు. పిల్లలనుకనుచున్నారు. దానితొ సంతుష్టి జెందితిరా? లేదే! గ్రహాంతరవాసి దొరికిన వివాహమాడినచో జీవితము ధన్యమగునని యోచించుచున్నారు. అందు గూర్చి పరిశోధనలు జేయుచున్నారు. ఇన్ని దుర్లక్షణములు, ఇన్ని దుర్గుణములు, ఇన్ని దుర్బుద్దులు మీ వైపు నుంచుకొని ఆడుదానిని ఈసడించుటయా? మీరు ఉచితముగా నిచ్చు పొడుములోనున్నపస మీ ఉపన్యాసములో లేదు. ఆ నస్యమునకై జనులు మునగచెట్టుకు గొంగళి పురుగులవలె, బెల్లమునకు ఈగలవలె జేరుతున్నారు. ఆ జనులను చూసి మీరు రెచ్చి పోవుచున్నారు. మీ పాండిత్య ప్రతిభా పాటవమను కొనుచున్నారు. మీ సభా వ్యాపారములు మీరు జేసుకొనుడు. మా జోలికిరాకుడు. మర్యాద నిలుపుకొనుడు. ఖబడ్దార్‌గా యుండుడు. అంతట శాస్త్రి లేచి మన సంఘము నారీ వ్యతిరేక భావనతో నున్నదని, తన వివాహమునకు అదియే ప్రతిభంధక మగుచున్నదని, తన ఈడువారికి మూడు నాల్గు పెళ్ళిళ్ళగుచున్ననూ తనకు ఒక్కటీ కాకున్నదని, ఇకపై ఆడువారిని లక్ష్యము చేసుకొనుట మాని మగ వారిని తిట్టవలయునని మన ఆచారి అభిప్రాయము. మగవారిని తిట్టుటకేమున్నది? వారికి పెళ్ళి మంత్రములే తిట్లు. వివాహబంధమే జైలు. సంతాన ప్రాప్తియే సంకెళ్లు. బ్రతకుటయే చావు. చావే బ్రతుకు. ఇంకనూ జెప్పుచుండ బయట అలజడి రేగినది. జనులు బయటకు పరుగులెడుచుండిరి. సభ ముగిసినది.

పానుగంటి వారికి కృతజ్ఞతలతో
ఎస్.జి.కె.

తమిళనాట అల్పాహార పథకం

- విద్యార్థులకు స్వయంగా వడ్డించిన సీఎం స్టాలిన్
- రాష్ట్రవ్యాప్తంగా అమలు

నాగపట్టణం: తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాలల్లో 'ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని' సీఎం స్టాలిన్ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా అందించే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు. దేశంలోనే విద్యార్థులకు పాఠశాలల్లో అల్పాహారం అందిస్తున్న తొలి రాష్ట్రం తమిళనాడే కావడం విశేషం. నాగపట్టణం జిల్లాలోని తిరుక్కువళై ప్రాథమిక పాఠశాలలో ఈ పథకం రెండో విడతను ప్రారంభించిన సీఎం స్టాలిన్... చిన్నారులకు అందించే అల్పాహారాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం పిల్లలకు స్వయంగా అల్పాహారం వడ్డించిన ముఖ్యమంత్రి... తాను కూడా చిన్నారులతో కలిసి అల్పాహారం తిన్నారు. చెన్నైలో స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఈ పథకాన్ని ప్రారంభించారు. వాస్తవానికి ఈ పథకాన్ని గతేడాది సెప్టెంబరులోనే ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం...ప్రయోగాత్మకంగా 1545 పాఠశాలల్లో ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆకలి బాధలు లేకుండా పిల్లలు పాఠశాలలకు హాజరయ్యేలా చూడటంతో పాటు వారిలో తీవ్ర ప్రభావం చూపుతున్న రక్తహీనతను తగ్గించడం, పోషకాహార స్థితిని మెరుగుపర్చడం, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచడం వంటి లక్ష్యాలతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పథకం విజయవంతమవడంతో తాజాగా శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 31,008 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు దీన్ని విస్తరించారు. ఈ స్కూళ్లలో మొత్తం 15,75,900 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ ఈ అల్పాహార పథకం అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రంలోని ఆయా నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు సైతం ఈ పథకాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనూ ఉచిత అల్పాహార పథకాన్ని విస్తరిస్తామని స్టాలిన్ ప్రకటించారు. గతేడాది సెప్టెంబరులో ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తూ చదువుకు పేదరికం, కులం అడ్డుకారాదన్న పెరియార్ ఈవీ రామస్వామి, సీఎన్ అన్నాదురై, ఎం.కరుణానిధి వ్యాఖ్యలను స్టాలిన్ ఉటంకించారు.

హింసకు కారణం కాంగ్రెసే

మణిపూర్ సీఎం ఎదురుదాడి



ఇంఫాల్: రాష్ట్రంలో కొద్ది నెలలుగా కొనసాగుతున్న హింసను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైన మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఇప్పుడు కాంగ్రెస్‌పై ఎదురుదాడి ప్రారంభించారు. ప్రస్తుతం మణిపూర్‌లో జరుగుతున్న అన్ని పరిణామాలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని ఆరోపించారు. రాష్ట్రంలో హింసను సృష్టించింది ఆ పార్టీయేనని ఎదురుదాడికి దిగారు. మనుషుల జీవితాలతో రాజకీయాలు చేయొద్దని ఆగ్రహం వ్యక్తంచేశారు. లడఖ్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ మణిపూర్ హింసపై మాట్లాడటాన్ని ఆయన తప్పుపట్టారు. లడఖ్‌లో ఉంటే లడఖ్ గురించే మాట్లాడాలని హితవుపలికారు. 'రాహుల్ లడఖ్‌లో ఉన్నప్పుడు, మణిపూర్‌లో ఉన్నప్పుడు మణిపూర్ గురించి ఎలా మాట్లాడుతారు. మీరు లడఖ్ వెళ్తే అక్కడి సమస్యల గురిచే మాట్లాడాలి. ప్రస్తుతం మణిపూర్‌లో జరుగుతున్నవాటన్నింటికీ కాంగ్రెస్ పార్టీయే కారణం. మనుషుల జీవితాలతో రాజకీయాలు చేయకూడదు' అని బీరేన్ సింగ్ వితండవాదం మొదలుపెట్టారు. రాష్ట్రంలో శాంతి నెలకొల్పేందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సలహాలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నామని చెప్పారు.

నిర్మాణరంగంలో కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

న్యూఢిల్లీ: దేశంలో పట్టణీకరణ వేగవంతమైన క్రమంలో 2030 నాటికి 60 కోట్ల మందికి పైగా ప్రజలు నగరాల్లో నివాసం ఉంటారని అంచనా వేస్తున్నట్లు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి శుక్రవారం తెలిపారు. 13,000 మందికి పైగా డెవలపర్ సభ్యులకు ప్రాతినిథ్యం వహిస్తున్న రియల్టర్ల అత్యున్నత సంస్థ క్రెడాయ్ నేతృత్వంలో ఇక్కడ 'నిర్మాణ రంగంలో కొత్తగా ఉద్భవిస్తున్న బిల్డింగ్ మెటీరియల్స్, సాంకేతికతలను ఉపయోగించడం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మంత్రి ప్రసంగించారు. 'నిర్మాణ పరిశ్రమలో అభివృద్ధి చెందుతున్న మెటీరియల్స్, టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి మనం సాధ్యమయ్యే మార్గాలను కనుగొనడం అత్యవసరం' అని మంత్రి అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ నిబద్ధత గురించి పూరీ మాట్లాడుతూ... నిర్మాణ పరిశ్రమలో పాత సాంకేతికతల నుండి కొత్త అత్యాధునిక సాంకేతికతలలోకి మారడాన్ని వేగవంతం చేయవలసిన అవసరాన్ని ప్రధాని నొక్కిచెప్పారని గుర్తు చేశారు. గ్లోబల్ హౌసింగ్ టెక్నాలజీ చాలెంజ్ కింద ప్రపంచవ్యాప్తంగా 54 వినూత్న నిర్మాణ సాంకేతికతలను మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. దీనికి అనుగుణంగా చెన్నై, రాజ్‌కోట్, ఇండోర్, లక్నో, రాంచీ, అగర్తలాలోని ఆరు లైట్‌హౌస్ ప్రాజెక్టులలో 6,368 ఇళ్లు నిర్మించబడుతున్నాయి. ఈ ఆరు ప్రాజెక్టుల్లో కొత్త టెక్నాలజీల వినియోగం వల్ల 50శాతం వరకు నిర్మాణ సమయం తగ్గుతుందని, 15-20 శాతం సిమెంట్ ఆదా అవుతుందని, 20 శాతం నిర్మాణ వ్యర్థాలు, నిర్మాణ వ్యయం 10-20 శాతం తగ్గించబడతాయని, ఇంధన వినియోగంలో 20 శాతం తగ్గింపు, జీహెచ్‌జీ ఉద్గారాల విడుదలలో 35 శాతం తగ్గించవచ్చని మంత్రి వివరించారు.

తరగతి గదిలో ఉరి పోసుకుని దళిత బాలుడి మృతి

కోట్‌పుట్లీ-బెహ్రూర్: రాజస్థాన్‌లోని కోట్‌పుట్లీ-బెహ్రూర్ జిల్లాలోని ప్రాగ్‌పురా ప్రాంతంలో ఓ విద్యార్థి తన తరగతి గదిలో ఉరి వేసుకున్న ఘటన కలకలం రేపింది. విద్యార్థి జవహర్ నవోదయ పాఠశాలలో 10 తరగతి చదువుతున్నాడు. బుధవారం ఈ దారుణం జరిగిందని, బాలుని మృతదేహం తీసుకునేందుకు అతడి కుటుంబీకులు నిరాకరించారని పోలీసులు తెలిపారు. ఇది ఆత్మహత్య కాదని, హత్య అని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనికి బాధ్యత వహించాల్సిన ఇద్దరు ఉపాధ్యాయులను అరెస్టు చేయాలని వారు నిరసనలకు దిగారు. ఇద్దరు ఉపాధ్యాయులు బాలుడిని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ఉరి వేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యులు ధర్నా చేస్తుండటం వల్ల పోస్ట్‌మార్టమ్ నిర్వహించలేకపోయాం. వారిని సముదాయిస్తున్నామని కోట్‌పుట్లీ-బెహ్రూర్ సూపరింటెండెంట్ రంజీత శర్మ తెలిపారు. నిందితులపై ఐపీసీలోని సెక్షన్ 302తో సహా పలు సెక్షన్ల కింద ఉపాధ్యాయులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

మళ్లీ నష్టాల్లో మార్కెట్ సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఆర్‌బీఐ మినిట్స్ నష్టాలకు కారణమయ్యాయి. ఆహార పదార్థాల ధరలు అధికంగా ఉండటంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగేందుకు అవకాశం ఉందనే భావనతో ఇటీవల ఎంపీసీలో కీలక రేట్లను యథాతథంగా ఉంచినట్లు ఆర్‌బీఐ మినిట్స్ ద్వారా వెల్లడైంది. దీంతో సెన్సెక్స్ 65 వేల పాయింట్ల దిగువన ముగయగా...నిఫ్టీ 19,300 మార్కును కోల్పోయింది. సెన్సెక్స్ 65,000.67 పాయింట్ల వద్ద గురవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 64,732 పాయింట్ల వద్ద కనిష్టాన్ని తాకిన సూచీ..చివరికి 365.83 పాయింట్ల నష్టంతో 64,886.61 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 120.90 పాయింట్ల నష్టంతో 19,265.80 పాయింట్ల వద్ద ముగిసింది. లాభపడిన షేర్లు: బజాజ్ ఫిన్‌కార్ప్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఓఎన్‌జీసీ, జియో ఫైనాన్షియల్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్ కంపెనీ, ఎస్‌బీఐ లైఫ్ ఎన్సూరెన్స్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్. నష్టపోయిన షేర్లు: డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, లార్సెన్ అండ్ టోబ్రో, పవర్‌గ్రిడ్ కార్ప్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అల్ట్రాటెక్ సిమెంట్స్, ఇండస్‌లాండ్ ఇండ్, ఇండస్ట్రియల్ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్.

బీజేపీ ఆదేశాల మేరకే లాలూపై సీబీఐ వేధింపులు: నితీశ్

పాట్నా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌ను సీబీఐ వేధింపులకు గురిచేస్తోందని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. దాణా కుంభకోణానికి సంబంధించిన కేసుల్లో ఆర్జేడీ అధ్యక్షుడి బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై ఇక్కడ పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా నితీశ్‌కుమార్ పై విధంగా వ్యాఖ్యానించారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాల మేరకే ఆయన (లాలూ) సీబీఐ చేత వేధింపులకు గురవుతున్నారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నది వాస్తవం' అని నితీశ్ స్పష్టం చేశారు. దాణా కుంభకోణానికి సంబంధించిన కేసుల్లో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌యాదవ్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సీబీఐ ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్లను ఆగస్టు 25న విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో వైస్‌ఛాన్సలర్ల (వీసీ) నియామకంపై బీహార్ ప్రభుత్వం- గవర్నర్ మధ్య నెలకొన్న గొడవపై కుమార్ మాట్లాడుతూ 'అలాంటిదేమీ లేదు... రాష్ట్రంలో విద్యా నాణ్యతను మెరుగుపరచడానికి మేము ఐక్యంగా కృషి చేస్తున్నాం' అన్నారు.

పదవీ విరమణ ప్రణాళికల్లో పురోగతి

ఆరోగ్య బీమాలకే మొగ్గు

ఐరిస్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: ప్రతి వ్యక్తి జీవితంలో బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం సహజం. యవ్వనం ఎంతో కాలం ఉండదు. వయోభారం తప్పదు. ఎంత మంచి ఉద్యోగంలో ఉన్నాగానీ పదవి విరమణ అనివార్యం. భారత్‌లో 58-60 ఏళ్లకు ఉద్యోగులు రిటైర్ కావల్సి ఉంటుంది. 60ఏళ్లు వచ్చాక జీవితంలో ఉరుకులు, పరుగులు ఉండవు. దినచర్య నెమ్మదిస్తుంది. చాలా మందికి కుటుంబ పోషణ భారం ఉండదు. పిల్లలు చూసుకుంటారన్న దీమా ఉంటుంది. కాబట్టి శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యంగా జీవించాలని దాదాపు అందరూ ఆకాంక్షించారు. ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుండటంతో దేశ యువత తమ రిటైర్మెంట్‌ను ముందుగానే ప్లాన్ చేసుకుంటోందని విషయమై మాక్స్ బీమా కంపెనీ, డేటా అనలిస్టిక్స్ కంపెనీ కాంతర్ సంయుక్త అధ్వర్యంలో జరిపిన ఆన్‌లైన్ సర్వేలో వెల్లడైంది. అనేక మంది తమ పదవీ విరమణ తర్వాత జీవితం గురించి ముందే ఆలోచిస్తూ తగు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు రిటైర్మెంట్‌కు ప్రణాళికలు రూపొందించుకునే వారిలో 57శాతం మంది ఆరోగ్యంపై దృష్టి పెట్టగా, 33శాతం మంది ఆర్థిక పరిస్థితికి, ఎనిమిది శాతం మంది కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్వే నివేదిక పేర్కొంది. భారత పదవీ విమరణ సూచీ అధ్యయనం (ఐరిస్) తేల్చింది. దీని ప్రకారం భారత పదవీ విరమణ సూచీ (0 నుంచి 100 వరకు స్కేల్‌పై) 44 నుంచి 47కు పెరిగింది. ఆరోగ్యం, ఫైనాన్స్ (ఆర్థికం), ఎమోషన్స్ (భావాలు) ఆధారంగా ఈ సర్వే 28 నగరాల్లో జరిగింది. 2,093 మంది పాల్గొన్నారు. పదవీ విరమణ తర్వాత ప్రశాంత జీవితాన్ని ఆకాంక్షించే వారిలో పట్టణవాసులు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. ప్రతి 10 మందిలో కనీసం ఏడుగురు తమ రిటైర్మెంట్ తర్వాత విలాసాలు, ప్రయాణాలతో కాలక్షేపం చేయొచ్చని ఆకాంక్షించారు. రిటైర్మెంట్ ప్రణాళికలు రూపొందించుకోవడంలో తూర్పు భారత్ మెరుగైన స్థితిలో ఉంది. ఉత్తరాదిన ఆరోగ్య సూచీ 40 పాయింట్లతో వెనకబడగా, దక్షిణ భారతం భావాల సూచీలో 61 పాయింట్లతో బలంగా ఉంది. మాక్స్ లైఫ్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈవో ప్రశాంత్ త్రిపాఠి స్పందిస్తూ ఆరోగ్యానికి ప్రాధాన్యత పెరిగిన క్రమంలో చాలా మంది ఆరోగ్య బీమాలను కలిగివున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడంపై దృష్టి పెడుతున్నారని, చాలా తక్కువ మంది కసరత్తుపై ఆశక్తి కనబరుస్తున్నారని చెప్పారు. తాజా సర్వే ప్రకారం 44 మందికి ఆరోగ్య బీమా ఉండగా 48శాతం మంది మూడేళ్లలో క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారని తేలింది. జోన్లవారీగా చూస్తే తూర్పు ప్రాంతంలో, టైర్ 2 నగరాల్లో ఆరోగ్యంపై అవగాహనలో మంచి పురోగతి కనిపిస్తున్నట్లు త్రిపాఠి వెల్లడించారు. ఆర్థిక ప్రణాళికల విషయానికొస్తే 90శాతం మంది ఆలశ్యంగా ఆదా చేయడం మొదలు పెట్టినట్లు చెప్పగా రిటైర్మెంట్ తర్వాత కనీసం పదేళ్లకు సరిపడే డబ్బును ఆదా చేసినట్లు 40శాతం మంది వెల్లడించారు. రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెట్టేవారు మరో 40శాతం మేర ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది.

పాకిస్తాన్‌కు మేమెలా ఆదేశాలిస్తాం: సుప్రీం

న్యూఢిల్లీ: రాజకీయ అంశాలను రాజకీయంగానే పరిష్కరించుకోవాలని, అందులో తాము జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. పాకిస్తాన్ జలాల్లో ప్రవేశించిన భారత మత్స్యకారుల అరెస్టుకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ జరపడానికి సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం నిరాకరించింది. భారతీయ జాలర్లను విడుదల చేయాలని పాకిస్తాన్‌కు ఆదేశాలివ్వడం సాధ్యం కాదని స్పష్టంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన పిటిషన్ ఈ అంశానికి వర్తించబోదని తెలిపింది. సరైన విధానాల ద్వారా తమ ప్రాథమిక హక్కుల అమలుకు సంబంధించి భారత పౌరులు సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 అవకాశం కల్పిస్తుంది. 'ఈ పిటిషన్ ఆర్టికల్ 32కు వర్తిస్తుందా? ఆర్టికల్ 32 ప్రకారం మేము ఆదేశాలు జారీ చేస్తే మన మత్స్యకారుల సమస్యలను భారత్, పాకిస్తాన్ ఎలా పరిష్కరించుకుంటాయి? మన జాలర్లను విడుదల చేయాలని మేము పాకిస్తాన్‌కు ఆదేశాలు జారీ చేయాలా?' అని జస్టిస్ సంజయ్ కిషన్, జస్టిస్ సుధాన్శు ధులియా ధర్మాసనం పిటిషనర్ల తరపు న్యాయవాదిని సూటిగా ప్రశ్నించింది. గుజరాత్‌కు చెందిన ఇద్దరు, మహారాష్ట్ర వాసి ఒకరు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం విచారణ జరిపింది. మత్స్యకారులతో పాటు ఖైదీల సమస్యల పరిష్కారానికి 2008లో ఏర్పాటు చేసిన విధంగా భారత్, పాకిస్తాన్‌కు చెందిన న్యాయమూర్తులతో జ్యుడిషియల్ కమిటీ ఏర్పాటు చేయాలని పిటిషనర్ల తరపు న్యాయవాది విన్నవించారు. 'నేటి పరిస్థితులు ఏమిటి? పాకిస్తాన్‌తో నేడు భారత్‌కు ఉన్న సంబంధాలు ఏమిటి? అని ప్రశ్నిస్తూ అవి ప్రభుత్వాలకు సంబంధించిన అంశాలని ధర్మాసనం స్పష్టంచేసింది. రాజకీయ అంశాలను రాజకీయంగానే పరిష్కరించుకోవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ అంశంపై ప్రభుత్వాన్ని సంప్రదించాలని పిటిషనర్‌కు సూచించింది.

గోవధకు యత్నం...ఎన్‌కౌంటర్‌లో నిందితుడికి గాయం

మీరట్: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో శుక్రవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఒకరి కాలికి గాయమైంది. ఎన్‌కౌంటర్ అనంతరం గోవధకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణపై ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. సార్ధన పోలీసు స్టేషన్ పరిధిలో ఫిరోజ్, మరో ముగ్గురితో కలిసి గోవధకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందిందని సీనియర్ ఎస్పీ రోహిత్ సింగ్ సజ్వాన్ చెప్పారు. పోలీసులు ఘటనాస్థలికి వెళ్లారని, ఫిరోజ్, అతని అనుచరులు పోలీసులపై కత్తులతో దాడికి ప్రయత్నించారని తెలిపారు.

నిందితులను పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నించగా నిందితుల్లో ఒకడు కాల్పులు జరిపాడని, ఎస్ఐ నైపాల్‌సింగ్‌కు బుల్లెట్ తగిలిందని, అయితే, ఆయన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకోవడంతో ప్రమాదం జరగలేదని ఎస్ఎస్‌పీ వివరించారు. పోలీసులు ఎదురుకాల్పులు జరపడంతో ఫిరోజ్ కాలుకు బుల్లెట్ తగిలిందని, ఫిరోజ్‌తో పాటు అతని అనుచరులను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఆవును చంపడానికి ఉపయోగించే పదునైన కత్తులను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామని సజ్వాన్ చెప్పారు. ఒక నిందితుడు తప్పించుకున్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

గోవాలో పర్యాటకురాలిపై లైంగికదాడి

పనాజీ: ఉత్తర గోవాలోని అసోనోరా గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. గ్రామంలోని ఒక రిసార్ట్‌లో పర్యాటకురాలిపై లైంగికదాడి జరిగింది. అత్యాచారానికి పాల్పడినట్టుగా భావిస్తున్న గుజరాత్‌కు చెందిన వ్యక్తి లక్ష్మణ్ షియార్ గోవా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మంగళవారం జరిగింది. మహిళ ఫిర్యాదు మేరకు 47 ఏళ్ల నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు పర్యాటకుడిగా గోవాలో ఉన్నాడు. ఆ మహిళ, నిందితుడు ఇంతకు ముందు విమానంలో కలుసుకున్నారని, ఈ నేపథ్యంలో వారి మధ్య స్నేహం కుదిరిందని డీఎస్పీ జీవ్బా దాల్వి చెప్పారు. ఆ తర్వాత మహిళ ఫోన్ నంబర్ తీసుకుని ఆమెతో తరుచూ మాట్లాడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ వారం ప్రారంభంలో బాధితురాలు, నిందితుడు వేర్వేరుగా గోవాను సందర్శించారు. మంగళవారం నిందితుడు బాధితురాలికి ఫోన్ చేసి అక్కడ ఉన్న పర్యాటక ప్రాంతాలను చూపిస్తానని నమ్మించి, అసోనోరాలోని తాను ఉంటున్న రిసార్టుకు రావాలని కోరాడు. ఆమె ఆ రిసార్టుకు వెళ్లగా నిందితుడు ఆమెను తన గదిలోకి తీసుకెళ్లి ఆమెపై లైంగికదాడి చేశాడు. ఈ ఘటన గురించి ఎవరికీ చెప్పవద్దని ఆమెను బెదిరించాడు. మహిళ ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

మధ్యప్రదేశ్ బీజేపీలో టికెట్ల లొల్లి

భోపాల్: త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్‌లో బీజేపీలో నిరసన జ్వాలలు రగులుకున్నాయి. అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు లొల్లి కాషాయ పార్టీకి తలనొప్పిగా మారుతున్నది. టికెట్లురాని అభ్యర్థుల మద్దతుదారులు పార్టీపై తిరగబడుతున్నారు. భోపాల్‌లోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం వద్ద వందలాది మంది కార్యకర్తలు నిరసన తెలిపారు. సోన్‌కచ్ నుంచి మాజీ ఎమ్మెల్యే రాజేంద్ర వర్మకు టికెట్ నిరాకరించడాన్ని కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. భోపాల్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీడీ శర్మ, కేంద్ర మంత్రులు భూపేంద్ర యాదవ్, అశ్విని వైష్ణవ్, నరేంద్ర సింగ్ తోమర్ సమావేశమయ్యారు. ఈ సమయంలోనే కార్యకర్తల నుంచి నిరసన ఎదురైంది. ఒక్క రాజేంద్ర వర్మ విషయమే కాదు.. రాష్ట్రంలోని మహారాజ్‌పూర్, ఛత్తర్‌పూర్, బండా, సుమావలి, సబల్‌ఘర్, లాంజీ, పంధుర్నా, సౌన్సర్‌తో సహా ఇతర స్థానాల నుంచి టిక్కెట్లు నిరాకరించిన బీజేపీ నాయకులు కూడా పార్టీ అధిష్ఠానంపై ఆగ్రహంతో ఉన్నారు. వారి అనుచరులు, మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు అధిష్ఠానం తీరుపై తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేకు టికెట్ నిరాకరించడాన్ని నిరసిస్తూ దేవాస్ జిల్లా సోన్‌కచ్-ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీజేపీ కార్యకర్తలు 400-450 వాహనాలలో భోపాల్‌కు వచ్చారు. బూత్ స్థాయి కార్యకర్తల నుంచి గ్రామ సర్పంచ్‌లు, ఇతర స్థానిక నాయకుల వరకు ఉన్న కార్మికులు వర్మకు తిరిగి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అధికార బీజేపీలో ఈ టికెట్ల పంచాయితీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి తీవ్ర నష్టాన్ని తీసుకొస్తుందని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.

ఈడీ సమన్లపై సుప్రీంకు జార్ఖండ్ సీఎం

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీచేయడాన్ని సవాల్ చేస్తూ జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భూకుంభకోణం కేసులో ఆగస్టు 14న తమ ముందు విచారణకు హాజరు కావాలని సోరెన్‌కు ఈ నెల 7న ఈడీ నోటీసులు జారీచేసింది. అయితే ఆరోజున బిజీ షెడ్యూల్ ఉండటంతో తాను విచారణకు హాజరుకాలేనని ఆయన చెప్పారు. దీంతో ఈ నెల 24న విచారణకు రావాలని మరోసారి సమన్లు జారీచేసింది. అయితే ఆయన ఈడీ విచారణకు డుమ్మా కొట్టారు. తాను సుప్రీంకోర్టులో సవాలు చేస్తున్నట్లు ఇప్పటికే ఈడీ డైరెక్టర్‌కు సోరెన్ లేఖ కూడా రాశారు. తాను ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రినని, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నానని సోరెన్ వ్యాఖ్యానించారు. ఈడీ సమన్లు జారీచేసిన విధానం చూస్తే తానేదో దేశం విడిచి పారిపోతున్నట్లు ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌తోపాటు మరో మనీలాండరింగ్ కేసుకు సంబంధించి హేమంత్ సోరెన్‌ను గతేడాది నవంబర్ 17న ఈడీ తొమ్మిది గంటలకుపైగా విచారించింది. ఇవే ఆరోపణలపై ఇప్పటికే ఐఏఎస్ అధికారి ఛవీ రంజన్, ఇద్దరు వ్యాపారవేత్తలు, కోల్‌కతాకు చెందిన అమిత్ అగర్వాల్, రాంచీలో షాపింగ్ మాల్స్‌ను కలిగి ఉన్న విష్ణు అగర్వాల్‌తో సహా 13 మందిని అరెస్టు చేసింది.

ఢిల్లీ ఎన్నికల సంఘంపై 'పిల్' తిరస్కృతి

న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈవీఎంలు, వీవీప్యాట్‌ల 'ఫస్ట్ లెవల్ చెకింగ్' (ప్రాథమిక స్థాయి తనిఖీ)కు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరును సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యా(పిల్)న్ని విచారణకు స్వీకరించేందుకు ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. 'ఫస్ట్ లెవెల్ చెకింగ్' (ఎఫ్ఎల్‌సి) ఎన్నికల సంఘం కోసం తగిన వ్యవధితో నోటీసులు ఇవ్వలేదని , రాజకీయ పార్టీలు ఈ ప్రక్రియకు సంసిద్ధం కాలేకపోయాయని ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు అనిల్ కుమార్ పిటిషన్‌లో పేర్కొన్నారు. తగిన నోటీసు ఇచ్చిన తర్వాత ఎఫ్ఎల్‌సిని తిరిగి సమావేశపరిచేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరారు. గత నెలలో ఎఫ్ఎల్‌సి ప్రారంభానికి అనుసరించిన మొత్తం ప్రక్రియ పారదర్శకంగా లేదని, భారత ఎన్నికల సంఘం ఆదేశాలకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. 'రాష్ట్ర ఎన్నికల సంఘం తగినంత సమయం ఇవ్వకుండా, ఆగస్టు 30, 2017, సెప్టెంబర్ 13, 2022 నాటి ప్రజలకు సూచనలకు విరుద్ధంగా మొత్తం ఎఫ్ఎల్‌సి ప్రక్రియను మూడు నెలలు ముందుగా చేపట్టింది. దీనివల్ల రాజకీయ పార్టీలు, సంబంధిత వాటాదారులను నిశ్శబ్ద ప్రేక్షకుడిగా చేసింది' అని పిటిషన్ కోర్టుకు వెల్లడించింది. అయితే ప్రధాన న్యాయమూర్తి సతీష్ చంద్ర శర్మ, న్యాయమూర్తి సంజీవ్ నరులాతో కూడిన ధర్మాసనం... 'పిటిషనర్ తాజా పిఐఎల్ దాఖలు చేసే స్వేచ్ఛతో పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని అభ్యర్థించినందున పిటిషన్ తిరస్కరించబడింది' అని పేర్కొంది.

ఇద్దరు బంగ్లా దేశీయుల అరెస్టు

థానె: సరైన పత్రాలు లేకుండా భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న ఇద్దరు బంగ్లాదేశ్ జాతీయులను నవీ ముంబై పోలీసులు అరెస్టు చేసినట్లు అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. ముందుగా అందిన సమాచారం ప్రకారం నవీ ముంబై పోలీసులకు సంబంధించిన మానవ అక్రమ రవాణా నియంత్రణ విభాగం గురువారం సాయంత్రం నేరుల్‌లోని నివాస ప్రాంతాలపై దాడి చేసిందని చెప్పారు. సరైన పత్రాలు లేకుండా అక్కడ జీవిస్తున్న మోఫిస్ మన్సూర్ షేక్, విజయలక్ష్మి దినేశ్‌కుమార్ రామ్‌లను పోలీసులు అరెస్టు చేశారని ఆయన తెలిపారు.

పాస్‌పోర్టు(భారత్‌లోకి ప్రవేశం) నిబంధనలు, విదేశీయుల చట్టం ప్రకారం అనేక సెక్షన్ల కింద నిందితులపై కేసు నమోదు చేశారు. వారిద్దరూ ఇక్కడ ఏడెనిమిది సంవత్సరాలుగా జీవిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా, 32 ఏళ్ల బంగ్లాదేశ్ జాతీయుడిని గతవారం భివాండి పట్టణంలో అరెస్టు చేసినట్లు థానె పోలీసులు శుక్రవారం చెప్పారు. ఉగ్రవాద నిరోధక దళానికి చెందిన బృందం నూర్ హుస్సేన్ అబ్దుల్ సలామ్ షేక్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు తిప్పికొడదాం

- మోదీ, జగన్ ప్రభుత్వాలను ఓడిద్దాం
- అంబేద్కర్ రాజ్యాంగమే దేశానికి రక్ష
- మచిలీపట్నం రౌండ్‌టేబుల్ సమావేశంలో రామకృష్ణ

విశాలాంధ్ర-మచిలీపట్నం: మోదీ, జగన్ సర్కార్లు బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడు తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఎన్ఐఏ, సీబీఐ, ఈడీ వంటి సంస్థల ద్వారా ప్రత్యర్థులు, విపక్షాల నాయకులపై అక్రమ కేసులు బనాయించి మోదీ ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ చేస్తుండగా...రాష్ట్రంలో సీఐడీ, పోలీసులతో భావప్రకటనా స్వేచ్ఛ లేకుండా జగన్ ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 'దేశాన్ని కాపాడు కుందాం-రాష్ట్రాన్ని రక్షించుకుందాం' నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం కృష్ణా జిల్లాలో పర్యటించింది. అందులో భాగంగా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఎస్ కన్వెన్షన్ హాల్‌లో 'రాజ్యాంగ హక్కులు- పరిరక్షణ' అనే అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల తప్పులను ప్రశ్నించటమే ప్రతిపక్షాల కర్తవ్యమన్నారు. రాజ్యాంగంపై గౌరవం లేనివారు పాలకులయ్యారని విమర్శించారు. అంబేద్కర్ రాజ్యాంగంపై గౌరవం లేదని ఆర్‌ఎస్ఎస్ అధికార పత్రికలో పేర్కొన్న అంశాన్ని ఆయన గుర్తుచేశారు. వీల్‌చైర్‌లో ఉండే దిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాను ఎనిమి దేళ్లుగా జైలులో ఉంచారని, రచయిత వరవర రావును తుపాకీతో పోరాడిన మిలిటెంట్‌లా జైలులో ఉంచుతున్నారని తెలిపారు. హైకోర్టు బెయిల్ ఇచ్చినా వారిని విడుదల చేయటం లేదని చెప్పారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్లలో ఒక్కసారి కూడా విలేకరులతో మాట్లాడలేదన్నారు. ఇక్కడ నాలుగేళ్లలో సీఎం జగన్ ఒకటి, రెండుసార్లు మీడియా ముందుకు రాలేదని ఆరోపించారు. గొప్పవాళ్లమైన తమను విలేకరులు ప్రశ్నిస్తారా అనే అహంభావం వల్లే మోదీ, జగన్ మీడియాకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. వైఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసును సీబీఐ తేల్చలేకపోతోం దన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్యాన్ని నలిపేస్తు న్నారని ఆందోళన వెలిబుచ్చారు. పుంగనూరులో ప్రతిపక్ష నేత సభపై జగన్ ప్రభుత్వం రాళ్లు వేయించిందన్నారు. ప్రతిపక్ష నాయకుల సభలు, సమావేశాలకు పేర్ని నాని ఆటంకాలు కలిగిస్తు న్నారని విమర్శించారు. ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తూ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాంటి పాలకులను సాగనంపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

దోచుకోవటం జగన్ లక్ష్యం: కొనకళ్ల

టీడీపీ నేత కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని దోచుకోవటమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఈ తరహా దోపిడీ చేయలేదన్నారు. ఇసుకపై వేలకోట్లు దండుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మద్యం ధరలు పెంచి పేదలను ఆర్థికంగా కుంగదీస్తున్నారన్నారు. రాష్ట్రంలో వ్యాపా రం చేయటానికి అందరూ భయపడుతున్నారన్నారు. అమెరికాలో ఆంధ్రులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సైతం రాజకీయాల్లోకి లాగేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర సమస్యలపై వైసీపీ ఎంపీలు పార్లమెంటులో నోరు మెదపడం లేదన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పౌర హక్కుల వేదిక నాయకుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనైనా దాడులు చేయాలని భావిస్తే అక్కడ ఇంటర్నెట్ సేవలు నిలిపివేస్తున్నారని, తద్వారా అక్కడ జరిగే అరాచకాలు బయట ప్రపంచానికి తెలియకుండా చేస్తున్నారని తెలిపారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు, మణి పూర్‌లో జాతుల మధ్య అల్లర్లకు ముందు ఇంటర్నెట్ లేకుండా చేశారన్నారు. మణిపూర్ ఘటనపై ఆ రాష్ట్ర డీజీపీకి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిందని, దీనిపై కేంద్రం జోక్యం చేసుకుని కొన్ని అంశాలను సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చిందన్నారు. న్యాయవ్యవస్థలో రాజకీయా లకు చోటు కల్పించేందుకు కేంద్రం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. బ్రిటీష్ వాళ్లకు పాలేరుగా పని చేసిన వాళ్లు, ఆర్‌ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేయని వాళ్ల కంటే దేశ ద్రోహులు ఎవరుంటారని ప్రశ్నించారు. ఐఎల్‌యూ జాతీయ ప్రధాన కార్యదర్శి సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు హిందూ మతోన్మాద అనుకూల రాజ్యాంగం తీసుకు రావాలని గత కుంభమేళాలో నిర్ణయించారన్నారు. ప్రతిష్ఠాత్మక పార్లమెంట్ భవనానికి అతిథులుగా వారు హాజరయ్యారని తెలిపారు. కేంద్రం కార్పొరేట్ శక్తులకు 12 లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చిందని, ఇలాగైతే ఆర్థిక సమానత్వం ఎలా సాధ్యమవుతుందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కమిటీ చైర్మన్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ తమకు వ్యతిరేకంగా మాట్లాడితే ఇంటికొచ్చి అంతు చూస్తామని బీజేపీ ఎంపీ పార్లమెంట్‌లో బెదిరించారని, ఆ ఎంపీపై స్పీకర్ ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఏపీకి రావాల్సిన హక్కులను ఎందుకు సాధించుకోలేకపోయారని వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. హిందీరాని వాళ్లు దేశద్రోహులు అనటం నేరమన్నారు. ద్రవిడ సంస్కృతిని బీజేపీ నాశనం చేస్తున్నదని ఆరోపించారు. దిల్లీలో అదానీ, అంబానీ రాజ్యాంగం అమలు చేస్తుంటే రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు జరుగుతోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ మాట్లాడుతూ ప్రశ్నించే వారిని ఉపా చట్టం కింద అక్రమంగా నిర్బంధిస్తున్నారన్నారు. జర్నలిస్టు తులసీచంద్‌ను హింసకు గురిచేస్తున్నారని, గతంలో గౌరీలంకేశ్, దభోల్కర్ వంటి మేధావులను చంపేశారని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పించటం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ మతిన్ మాట్లాడుతూ మైనార్టీలపై మూకదాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఇక్కడ ఒకలా... కేంద్రంలో మరోలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. మణిపూర్ ఘటనలకు వ్యతిరేకంగా తాము నిర్వహించిన ర్యాలీల్లో పాల్గొన్న రాజకీయ పార్టీలు పార్లమెంటులో బీజేపీకి అనుకూలంగా ఓటు వేస్తున్నాయని చెప్పారు. సీపీఐ కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి టి.తాతయ్య స్వాగతం పలుకగా, మచిలీపట్నం నగర కార్యదర్శి లింగం ఫిలిప్ వందన సమర్పణ చేశారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, కోశాధికారి ఆర్.పిచ్చయ్య బృందం అభ్యుదయ గీతాలు ఆలపించింది.

మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు. వేదికపై రామకృష్ణ, వనజ, చలసాని శ్రీనివాస్, కొనకళ్ల నారాయణ, సుంకర రాజేంద్రప్రసాద్, మతిన్, తాతయ్య, గోపిచంద్

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

- రేపల్లె, తెనాలిలో రోడ్‌షో
- అమరావతి రైతులతో ముఖాముఖి
- మంగళగిరిలో బహిరంగసభ

బీజేపీ అధికారంలోకి వస్తే

రాజ్యాంగానికి ముప్పే

పోలీసులతో ఉద్యమాల అణిచివేత

చల్లపల్లి సభలో రామకృష్ణ

విశాలాంధ్ర- చల్లపల్లి: 'రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి' అందరి నినాదం కావాలని, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ బస్సుయాత్ర శుక్రవారం సాయంత్రం చల్లపల్లి చేరింది. చల్లపల్లిలో చండ్ర రాజేశ్వరరావు కేంద్రంలో జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు మోదీ చెప్పిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని విమర్శించారు. 2024లో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తారని హెచ్చరించారు. దేశంలో ప్రమాదకర రాజకీయాలు నడుస్తున్నాయని, 26 విపక్ష పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా ఏకతాటిపైకి రావడం శుభపరిణామమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా దివాలా తీసిందని, విభజన సమయంలో తెలంగాణ కంటే ఎక్కువ ఆదాయం ఉన్న ఆంధ్రప్రదేశ్...నేడు తెలంగాణ కన్నా వెనుకబడిందన్నారు. పరిశ్రమలను పారదోలితే రాష్ట్రం ఏ రకంగా అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్నపూర్ణగా పిలిచే ఆంధ్రప్రదేశ్‌లో ఆయకట్టు తగ్గిపోతోందని చెప్పారు. సామాన్యుల ప్రయోజనాల కోసం కాకుండా కోటీశ్వరుల ఆస్తులు పెంచేందుకే మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బ్యాంకుల్లో వేలకోట్లు అప్పులు తీసుకుని విదేశాలకు పారిపోయిన వారంతా విజయ్ మాల్యా మినహా గుజరాత్ వారేనని, ఒక్కరినైనా విదేశాల నుంచి వెనక్కి తీసుకొచ్చి జైలులో పెట్టారా అని రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని, ఏపీ జీవనాడి పోలవరం ముందుకుసాగడం లేదన్నారు. దొంగ బిల్లులతో ఇసుకను దోచేస్తున్నారని, మద్యం పేరుతో వేలకోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. పోలీసులతో ఉద్యమాలను అణిచివేస్తున్నారన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ బీజేపీని గద్దెదించే పోరాటంలో అందరూ కలిసిరావాలని పలుపునిచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సీఎం జగన్ రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ, అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లా నేతలు దోనేపూడి శంకర్, పెన్మెత్స దుర్గాభవాని, విజయలక్ష్మి, పరుచూరి రాజేంద్ర, లెనిన్‌బాబు, అప్సర్, కృష్ణారావు, ఆర్.పిచ్చయ్య, టి.తాతయ్య, ఎం.విజయకుమార్, ఉమాకాంతం, ఎం.రత్నకుమారి, గుత్తికొండ రామారావు, సురేంద్రనాథ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు. తొలుత మాజేరు వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో బస్సుయాత్రకు ఘనస్వాగతం పలికారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చియ్య నేతృత్వంలో కళాకారులు ఆలపించిన గేయాలు ఆహుతులను ఆలోచింపజేశాయి.

చంద్రయాన్-3 అందించే సమాచారంతో ప్రపంచానికి మేలు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూదిల్లీ: చంద్రయాన్-3 ద్వారా చంద్రుడి నుంచి లభించే కొత్త సమాచారం యావత్ ప్రపంచానికి మేలు చేస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగించిన రాష్ట్రపతి... చంద్రుని దక్షిణ ధృవాన్ని చేరుకున్న మొదటి దేశంగా భారత్ నిలిచిందన్నారు. ఇది భారత శాస్త్రవేత్తల అపూర్వ విజయమని కొనియాడారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో బ్రహ్మ కుమారీల మాజీ చీఫ్ దాది ప్రకాశమణి జ్ఞాపకార్థం ముర్ము పోస్టల్ స్టాంపును కూడా విడుదల చేశారు. ఈ స్టాంపును దాది ప్రకాశమణి 16వ వర్ధంతిని పురస్కరించుకుని తపాలా శాఖ, కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ చేపట్టిన 'మై స్టాంప్' కార్యక్రమం కింద విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... దాది ప్రకాశమణి భారతీయ విలువలను, సంస్కృతిని దేశ విదేశాల్లో చాటారన్నారు. 'ఆమె నాయకత్వంలో బ్రహ్మ కుమారీస్...మహిళల నేతృత్వంలో నిర్వహించే ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సంస్థగా అవతరించింది. నిజమైన నాయకురాలిగా ఆమె బ్రహ్మ కుమారీల కుటుంబానికి ప్రతికూల పరిస్థితులలో కూడా అండగా నిలిచారు. ఎల్లప్పుడూ వారికి మార్గనిర్దేశం చేశారు' అని ముర్ము చెప్పారు. జీవితం తాత్కాలికమని, ఒక వ్యక్తి తన పనుల వల్లనే గుర్తుంటాడన్నది ప్రపంచంలోనే అతిపెద్ద సత్యమని రాష్ట్రపతి అన్నారు. ప్రజా సంక్షేమ భావంతో ఉదాత్త పనులు చేయాలని ఆమె కోరారు. 'దాదీ జీ భౌతికంగా మన మధ్య లేకపోవచ్చు కానీ ఆమె ఆధ్యాత్మిక, గంభీరమైన వ్యక్తిత్వం, ఆమె మానవ సంక్షేమ సందేశ తాలూకు జ్ఞాపకాలు మన మధ్య ఎల్లప్పుడూ సజీవంగా ఉంటాయి. రాబోయే తరాలకు స్ఫూర్తిని ఇస్తాయి' అని ముర్ము కొనియాడారు.

మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలపై

11న మహా ధర్నా

అఖిలపక్షసమావేశంలో జేవీ సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర-గార: కేవలం 500 ఎకరాల్లో మూలపోర్టు నిర్మాణం ఒక బూటకమని, దీని వెనక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర పూరిత ఆలోచనలు దాగి ఉన్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా మూలపేట పోర్టుకు బలవంతపు భూ సేకరణ, పోర్టు నిర్వాసితుల సమస్యలపై అఖిలపక్ష సమావేశాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు హాజరై మూలపేట పోర్టు గురించి తమ వాణిని వినిపించారు. మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను వంచించాలని చూస్తే తాము ఉద్యమిస్తామని వెంకటరమణ హెచ్చరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో నిర్వాసితుల కాలనీలు ఇవ్వడంలోనే ప్రభుత్వం డొల్లతనం తేటతెల్లమవుతోందని, ఎటువంటి పునరుద్దరణ కార్యాచరణ చేపట్టకుండా మూలపేట రైతుల పంటలను రౌడీమూకలతో ధ్వంసం చేసే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇది కేవలం కొంతమంది లబ్ధికోసమేనని ఆయన విమర్శించారు. శాంతియుతంగా బతుకుతున్న ప్రజలపై అధికార పక్షం విషం చిమ్ముతున్నదని విమర్శించారు. ప్రభుత్వాలు వెంటనే మూలపేట నిర్వాసితులకు మెరుగైన పునరావాసంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 11న అఖిలపక్ష నాయకులతో కలిసి మూలపేటలో నిర్వాసితులు తరపున మహా ధర్నా నిర్వహించి, నిర్వాసితులకు అండగా నిలబడతామన్నారు. కనీసం పర్యావరణ అనుమతులు లేకుండా పోర్టు నిర్మాణం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ డ్రామా కేవలం విలువైన భూదోపిడీ కోసమేనని విమర్శించారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ పోర్టు నిర్మాణానికి మూలపేట అంత అనుకూల ప్రదేశం కాదని,ఈ విషయం సాంకేతిక పరమైన అంశాల్లో అనేకసార్లు తేటతెల్లమైందన్నారు. వాస్తవాలకు విరుద్ధంగా వెళ్లడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన ఎజెండా అని చెప్పారు. ప్రజలు ఒప్పుకుంటేనే భూ సేకరణ చెయ్యాలనే విషయాన్నీ, 2013 భూసేకరణ చట్టం చెప్తోందని తెలిపారు. మూలపేట పోర్టు విషయంలో జిల్లా కలెక్టర్ తీరు మార్చుకోవాలని హితవుపలికారు. జీరాయితీ భూముల మాదిరిగానే అసైన్డ్ భూములకు పరిహారం చెల్లించాలన్నారు. మూలపేటలో పాగా వేసిన విశ్వసముద్ర కంపెనీ జగన్ భినామీదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, మంత్రులు నిర్వశితుల భూముల్లో కుటుంబంతో పాటు కొన్నాళ్ళు నివసించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు మాట్లాడుతూ అభివృద్ధి ముసుగులో వేలాది ఎకరాలను ఆదాని, అంబానీలకు కట్టపెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను వంచించాలని చూస్తున్నాయని అన్నారు. మూలపేట పోర్టులో జరుగుతున్నది అభివృద్ధి కాదని, విధ్వంసమని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు మాట్లాడుతూ ఏడాదిలో కొన్ని నెలలు పాటు తీర ప్రాంతాల్లో వీస్తున్న గాలులకు ఇసుక తిన్నెలు అధిక మొత్తంలో మేటలు వేసున్నదని, ఈ పరిణామం పోర్టుకు ఎంత మాత్రం పనికిరాదన్న విషయం కేంద్ర జల పరిశోధన కమిటీ 1993లో ఒక నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసి) జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, లిబరేషన్ జిల్లా కార్యదర్శి సన్యాసి రావు కూడా మాట్లాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, జనసేన పార్టీ నాయకులు కూర్మారావు, సంతబొమ్మాళి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు జీరు భీమారావు, కే నారం నాయుడు, ఎం కేశవరావు, కే జగ్గారావు, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

మోదీని ఓడించడం సులభమే

ఇండియా కూటమి విజయం తథ్యం

బీహార్ ఎన్సీపీ అధ్యక్షుడు రాణా రణ్‌వీర్ సింగ్

(పాట్నా నుండి డి.సోమసుందర్)

పాట్నా: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడించడం సులభమేనని, ఇండియా కూటమి విజయం సాధించడం తథ్యమని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) బీహార్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రాణా రణ్‌వీర్‌సింగ్ ధీమా వ్యక్తం చేశారు. ఆయన గురువారం తన కార్యాలయంలో 'విశాలాంధ్ర' ప్రత్యేక ప్రతినిధితో మాట్లాడారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, అవినీతి వంటి సమస్యలు 2024 లోక్‌సభ ఎన్నికలకు ప్రధానాంశాలుగా ఉంటాయని రణ్‌వీర్‌సింగ్ వివరించారు. కొందరు నమ్ముతున్నట్లు మత విభజన రాజకీయాల ప్రభావం ఎంత మాత్రమూ ఉండబోదని ఆయన తెలిపారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ నిజస్వరూపాన్ని ప్రజలు బాగా అర్థం చేసుకుంటున్నారని, పాలనా వైఫల్యాల నుంచి, తమ అవినీతి కార్యకలాపాల నుంచి దృష్టి మళ్లించడానికి నిరంతరం మత విభజన రాజకీయాలు తెరపైకి తెస్తున్నారన్న సంగతి ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అధిక ధరలకు, నిరుద్యోగం, అవినీతికి, కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలకు వ్యతిరేకంగా ఆగస్టు 9 నుంచి బీహార్ లో తమ పార్టీ క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో తమపార్టీ "బీజేపీ భారత్ చోడో" నినాదంతో ప్రచారందోళన చేపట్టిందని ఆయన వివరించారు. బీజేపీ నాయకులు వల్లెవేస్తున్న హిందూ- ముస్లిం, పాకిస్తాన్, చైనా లాంటి మాటలు వినీ వినీ ప్రజలు వాటిలోని సారాంశాన్ని ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. పెరుగుతున్న పెట్రోల్ డీజిల్, వంటగ్యాస్ ధరలు సామాన్య ప్రజలకు భారంగా మారాయని అన్నారు. మున్నెన్నడూ లేనంతగా దేశంలో నిరుద్యోగం పెరిగి పోవడంతో యువత ఆగ్రహంగా ఉందని తెలిపారు. పూజలు, పురాణ పఠనాలు ఆకలి తీర్చలేవనే సంగతిని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని రణ్‌వీర్ సింగ్ స్పష్టం చేశారు. హిందూ మతం అంటే బీజేపీ, బీజేపీ అంటే హిందూ మతం అనేటట్లుగా ఆ పార్టీ చేసే ప్రచారం బూటకమని , బీహార్ లో హిందూ మతాన్ని అనుసరించే ప్రజల్లో అత్యధికులు జేడీయూ, ఆర్జేడీ పార్టీలకు ఓటు వేస్తున్నారన్న వాస్తవాన్ని గుర్తించాలని రణ్‌వీర్‌సింగ్ అన్నారు. బీహార్‌లో ఇండియా కూటమికి గట్టి పునాది ఉందని, నితీశ్‌కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్, కాంగ్రెస్, వామపక్షాలు, ఎన్సీపీ, కలిసినందున అదొక అత్యంత బలమైన శక్తిగా ఆవిర్భవిస్తుందని రణ్‌వీర్ సింగ్ వివరించారు. ఇండియా కూటమికి బీహార్ లో 64 శాతం ప్రజల మద్దతు ఉందని ఆయన తెలిపారు. మహారాష్ట్రలో ఎన్సీపీలో వచ్చిన అంతరంగిక విభజన పర్యవసానం గురించిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ... తమపార్టీ నుంచి కొందర్ని చీల్చడానికి చేసిన ప్రయత్నం ద్వారా బీజేపీ కూటమి బలహీనంగా ఉన్నట్లుగా తనకు తానే వెల్లడించుకుందని అన్నారు. ఒక నాయకుడు బైటికి వెళ్తే పార్టీకేడర్, మొత్తం ఓటర్లు ఆయన వెంట వెళ్లిపోతారనుకోవడం బొత్తిగా అమాయకత్వం అని చెప్పారు. మహారాష్ట్రలో శివసేన అంటే బాల్ ఠాక్రే, ఎన్సీపీ అంటే శరద్ పవార్ మాత్రమేనని, ఆ సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని రణ్‌వీర్ సింగ్ స్పష్టం చేశారు. బాల్ ఠాక్రే వారసునిగా ఉద్ధావ్ ఠాక్రేనే శివసైనికులు గుర్తి స్తారని, అలాగే శరద్ పవార్‌తోనే మొత్తం ఎన్సీపీ కుటుంబం ఉందని, ఉంటుందని అన్నా రు. మహారాష్ట్రలో బీజేపీ కూటమికి పరాభవం కొత్తది కాదన్నారు. గతంలో ఎన్సీపీ తరపున గెలిచిన 47 మంది ఎమ్మెల్యేలను బీజేపీ తనలోకి ఫిరాయింపు చేయించారని... అయితే తర్వాతి ఎన్నికల్లో ఫిరా యింపు దారులు 45 మంది ఓటమి పాలయ్యారని, ఎన్సీపీ 58 సీట్లలో గెలిచిందని, బీజేపీ కి మహారాష్ట్రలో మరోసారి పరాభవం తప్పదని రణ్‌వీర్‌సింగ్ స్పష్టం చేశారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ముంబైలో జరగనున్న ఇండియా కూటమి సమావేశాల తర్వాత దేశ రాజకీయాలు మరింత స్పష్టతను సంతరించు కుంటాయని వెల్లడించారు. మాయావతి వైఖరిపై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ... ఈడీ కేసులు ఉన్నందున ఆమె వేచి చూస్తున్నారని, కొద్ది నెలల్లో ఎవరు ఎవరితో ఉంటారో తేలిపోతుందని అన్నారు. హిందీ బెల్ట్ లో మోదీ వ్యతిరేక కూటమి నానాటికీ బలోపేతం అవుతోందని రణ్ వీర్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు.

మోసకారి మోదీని గద్దె దించాలి

- ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్ పిలుపు
- అక్టోబరు 3న లఖింపూర్‌కేరీ దివస్
- నవంబరు 26, 27, 28 తేదీల్లో రాష్ట్ర రాజధానుల్లో ఆందోళనలు
- మథురలో ఏఐకేఎస్ జాతీయ సమితి సమావేశాలు ప్రారంభం



విశాలాంధ్ర-మథుర (ఉత్తరప్రదేశ్): రైతాంగ ఉత్పత్తులకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం తెస్తామంటూ లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయని మోసకారి నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రైతాంగం సమాయత్తం కావాలని అఖిల భారత కిసాన్‌సభ (ఏఐకేఎస్)జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని మథుర 'రాధేమోహన్ గ్రీన్స్' ప్రాంగణంలో శుక్రవారం ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య అధ్యక్షతన జాతీయ సమితి సమావేశాలు ప్రారంభమయ్యాయి. అతుల్‌కుమార్ అంజాన్ ప్రారంభోపన్యాసం చేస్తూ... ఈ ఆగస్టు 15వ తేదీన మోదీ ఎర్రకోటనుంచి ప్రసంగిస్తూ... వచ్చే ఏడాది ఆగస్టు (2024)లో సైతం తానే తిరిగి ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ చేస్తానంటూ అహంకార పూరిత ప్రసంగం చేశారన్నారు. దేశంలో రైతాంగాన్ని, పేద ప్రజలను, కార్మిక వర్గాన్ని లూటీ చేస్తూ, కార్పొరేట్ ప్రయోజనాలకు రక్షణగా నిలుస్తున్న మోదీ గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 2024లో కార్పొరేట్ అనుకూల, మత దురంహకార ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాకుండా, గ్రామీణ ప్రాంత ప్రజలు ఐక్యంగా అడ్డుకోవాలన్నారు. రైతాంగ ఉద్యమ బలోపేతంతోనే గ్రామీణ ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టంచేశారు. మోదీ ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ రంగం కుదేలైందని, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని, చిన్న, సన్నకారు రైతులు సాగుచేస్తున్న భూములను సైతం కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలను మోదీ ప్రభుత్వం రూపొందిస్తోందని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగ పురోభివృద్ధి ద్వారానే గ్రామీణ నిరుద్యోగాన్ని రూపుమాపవచ్చని చెప్పారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనే మోదీ ప్రభుత్వ హామీని నిలబెట్టుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, అక్టోబరు 3వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు లఖింపూర్ కేరీ దివస్ నిర్వహించాలని, నవంబరు 26, 27, 28 తేదీల్లో అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయరంగానికి ప్రత్యేక బడ్జెట్: రావుల వెంకయ్య

రావుల వెంకయ్య మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ రూపొందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాభివృద్ధికి అనుబంధ పరిశ్రమల ఏర్పాటు మాత్రమే దోహదపడుతుందన్నారు. వ్యవసాయ పరిశోధనలకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక నిధులు కేటాయించాలని, వ్యవసాయ, అనుబంధ కళాశాలలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముందుగా ఇటీవల మృతి చెందిన వివిధ రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాల నాయకులకు సమావేశం సంతాపం ప్రకటించింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్‌తోపాటు, కార్యదర్శి ఏ కాటమయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, సంఘ నాయకులు శ్రీనివాస్, సూర్యనారాయణ, వెంకటయ్య తదితరులు హాజరయ్యారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.